VELTHURU TELUGU DAILY
వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 22.06.2026
సంపుటి : 08 సంచిక : 13 , పేజీలు : 12 , వెల:రూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com

రాహుల్ అపాయింట్‌మెంట్ ఇప్పించండి

యోగాతోనే ప్రపంచ శాంతి

ఢిల్లీ వెలుతురు జూన్ 21:

యోగా అనేది కేవలం కొన్ని ప్రత్యేక రోజుల్లో చేసే వ్యాయామం కాదని, దానిని ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మార్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్ వేదికగా జరిగిన ఘనమైన వేడుకల్లో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశవిదేశాల నుండి తరలి వచ్చిన వేలాది మంది యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీ స్వయంగా ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. యోగా అనేది కేవలం శారీరక ఆరోగ్యానికే పరిమితం కాదని, ప్రపంచ దేశాల మధ్య శాంతిని, సామరస్యాన్ని పెంపొందించే అద్భుతమైన మార్గమని ప్రధాని ఈ సందర్భంగా అభివర్ణించారు.ఏడాది మొత్తంలో పగటి సమయం అత్యధికంగా ఉండే సుదీర్ఘమైన రోజు జూన్ 21 అని, అందుకే ఈ రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఈ విశేషమైన రోజున ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు ఒకే తాటిపైకి వచ్చి యోగా సాధన చేయడం వల్ల, ఇది భూమిపైనే అత్యంత భారీ సామూహిక కార్యక్రమంగా నిలుస్తోందన్నారు. ప్రపంచంలోని నలుమూలల నుండి యోగాకు సంబంధించి ఒకదానిని మించి మరొకటి అన్నట్లుగా వస్తున్న అద్భుతమైన చిత్రాలు మానవాళి ఐక్యతను చాటుతున్నాయని మోదీ హర్షం వ్యక్తం చేశారు.భారతదేశంలో యోగా ఉత్సవాల ఉత్సాహం అంబరాన్ని తాకిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఉత్తరాన మంచుతో నిండిన హిమాలయ పర్వత శ్రేణుల నుండి దక్షిణాదిన ఉన్న హిందూ మహాసముద్ర తీరం వరకు, తూర్పున ఉన్న పశ్చిమ బెంగాల్ నుండి పశ్చిమాన ఉన్న సౌరాష్ట్ర (గుజరాత్) వరకు దేశంలోని ప్రతి పల్లె, ప్రతి నగరం యోగా శక్తితో చైతన్యవంతంగా కనిపిస్తోందన్నారు.

▶ మిగతా 4లో

నేడే భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో మంత్రి జూపల్లి పర్యటన

- బౌద్ధ క్షేత్రాలు ఫణిగిరి, గాజులబండలో సంరక్షణ, పునరుద్ధరణ పనులను ప్రారంభించనున్న మంత్రి
- భువనగిరి కోట పర్యాటక అభివృద్ధి పనులను పర్యవేక్షించనున్న మంత్రి జూపల్లి

మారుతున్న వాతావరణం

- ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వానలు
- 10 జిల్లాలకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్'
- ఒకవైపు వానలు.. మరోవైపు ముంచెత్తుతున్న వడగాల్పులు
- 28 జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు



- బయ్యారంలో అత్యధిక వేడి..
- చంద్రుగొండలో భారీ వర్షపాతం
- హైదరాబాద్‌లో అకస్మాత్తుగా మారిన వాతావరణం

బీజేపీ కుట్రతోనే నామినేషన్ తిరస్కరణ

- ఎన్నికల అధికారులతో కమలం పార్టీ కుమ్మక్కు..
- కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి సంచలన వ్యాఖ్యలు

- తెలంగాణ సీటు తీసుకోనని స్పష్టం చేసిన నటరాజన్
- బీజేపీ కావాలనే అబద్ధాలు సృష్టించిందని వెల్లడి
- శ్రేతకు అండగా ఉంటానని హామీ
- బీజేపీ, ఈసీ కుమ్మక్కయ్యాయని ఆరోపణలు..
- ఒకే దేశం ఒకే ఎన్నిక' కోసమే చేస్తున్నారని విమర్శ
- న్యాయవ్యవస్థపై నమ్మకముందని వెల్లడి
- కాంగ్రెస్ నేతలు, హైకమాండ్ అండగా ఉందన్న మీనాక్షి

రైల్వే మంత్రితో భేటీకి చొరవ చూపండి

- కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ..
- ఢిల్లీ పర్యటన వేళ చర్చనీయంగా మారిన వైనం
- మెట్రో ఫేజ్-2 విస్తరణపై కేంద్రం సత్వర నిర్ణయం తీసుకోవాలి
- పాత లేఖల ప్రస్తావన.. గతంలోనే విజ్ఞప్తి చేసిన సీఎం
- పూర్తి ఆధారాలతో ఢిల్లీకి బయలుదేరనున్న ముఖ్యమంత్రి
- కేంద్రం నిధులను అడ్డుకోలేదు: కిషన్ రెడ్డి కౌంటర్
- కిషన్ రెడ్డి తదుపరి అడుగుపైనే రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై సర్వత్రా ఆసక్తి

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర రవాణా రంగానికి తలమానికంగా నిలిచిన 'మెట్రో రైల్ ప్రాజెక్టు' విస్తరణ, కేంద్ర నిధుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హస్తిన పర్యటనకు సిద్ధమయ్యారు.

▶ మిగతా 4లో

హుస్నాబాద్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

హుస్నాబాద్ వెలుతురు జూన్ 21:

హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై మున్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వయంగా యోగాసనాలు వేశారు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరం ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. సూర్య నమస్కారాలు మానవ శరీరానికి ఎంతో ఉత్తమమైనవని కొనియాడారు.పట్టణ కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్య నమస్కారాల భంగిమల (స్టాచ్యూస్) ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి "ఆరోగ్య హుస్నాబాద్ – ఆరోగ్య భారత్" నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. యోగా మాస్టర్ అనిత అందరినీ మోటివేట్ చేస్తూ, ఆసనాలను చక్కగా వేయించడాన్ని అభినందించారు.యోగా చేయడానికి వయసుతో ఎలాంటి సంబంధం లేదని, ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్య జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదానికి తగ్గట్టుగా హుస్నాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి చైతన్యాన్ని నింపింది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కౌంటర్

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

రెండున్నర ఏళ్ళలో మేము చేసిన అభివృద్ధి కి , బీజేపీ 12 ఏళ్ళ అభివృద్ధి కి చర్చ కు సిద్దమా..?

నల్లధనం సంగతి ఏంటి , సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల గురించి రాంచందర్ రావు మాట్లాడండి.రాంచందర్ రావు మోడీ సమయం ఇప్పిస్తే మీ మూడు ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీల గురించి అడుగుతాం.అప్పుడు రాహుల్ గాంధీ సమయం గురించి మాట్లాడుదాం ముందు మీరిచ్చిన హామీల పై దృష్టి పెడితే మంచిది.

ఏపీలో 'ఇంటింటికీ యోగా'

కాంగ్రెస్ సంస్థాగత బలోపేతమే లక్ష్యం: పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

- గాంధీ భవన్‌లో సంఘటన్ సృజన్ అభియాన్ సమీక్ష
- ఎస్ఐఆర్ ప్రక్రియపై కీలక చర్చ
- బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పిలుపు

ప్రశాంతంగా ముగిసిన నీట్

- పకడ్బందీ నిఘా నడుమ పరీక్ష
- 22.79 లక్షల మంది అభ్యర్థులు హాజరు
- దేశవిదేశాల్లో 5,454 కేంద్రాలు..
- 24 గంటల నిఘా.. పుకార్లకు స్వస్తి

భారతదేశ గతినే మార్చిన మహనీయుడు మోదీ

- ప్రపంచ రాజకీయాల్లో కీలక శక్తిగా భారత్ ఎదిగేలా చేశారు
- అగ్ర రాజ్యాలే భారత ప్రధానికి రెడ్ కార్పెట్ పరిచి సెల్యూట్ చేసే స్థితికి తీసుకొచ్చారు

భారతదేశ గతినే మార్చిన మహనీయుడు మోదీ

- పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు
- 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చారు
- డిజిటల్ ఇండియాతో విప్లవం సృష్టించారు
- అవినీతిరహిత పాలనను కొనసాగిస్తున్నారు
- ప్రపంచ వేదికపై భారతదేశ గౌరవాన్ని పెంచారు
- జాతీయ భద్రతలో రాజీలేని తీరు మోదీ సొంతం
- ఆత్మనిర్భర్ భారత్ తో దిగుమతి నుండి ఎగుమతి చేసే స్థాయికి చేర్చారు
- మౌలిక సదుపాయాల కల్పనలో సునామీ సృష్టించారు
- 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 5 లక్షల కోట్లు జమ చేశారు
- మహిళా సాధికారతను చేతల్లో చూపుతున్నారు
- తెలంగాణకు మోదీ ప్రభుత్వం 12 ఏళ్లలో రూ.13 లక్షల కోట్లు ఇచ్చారు
- హైవేల విస్తరణ కోసమే కేంద్రం లక్షా 15 వేల కోట్లు ఖర్చు చేసింది
- సామాన్యుడు కూడా ప్రధాని కావొచ్చని నిరూపించిన నేత మోదీ
- నెహ్రూ రికార్డును బద్దలు కొట్టి చరిత్ర సృష్టించిన మహానేత
- ప్రతిపక్ష పార్టీ నాయకులే విదేశాలకు వెళ్లి దేశ ప్రధానిపై విషం చిమ్ముతున్నారు
- సర్జికల్ స్ట్రయిక్స్, ఆపరేషన్ మహదేవ్ పైనా సెటైర్లు వేసి దేశ పరువు తీస్తున్నారు
- 2014కు ముందు ఈశాన్య రాష్ట్రాల దుస్థితి దారణం
- అభివృద్ధికి నోచుకోక అల్లాడిపోయారు
- మోదీ వచ్చాక కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయిస్తున్నారు
- ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆత్మవిశ్వాసాన్ని పెంచారు
- సరిహద్దులను ఫెన్సింగ్ నిర్మించి డ్రగ్స్, అక్రమ ఆయుధాలు రాకుండా అడ్డుకుంటున్నాం
- రోహింగ్యాలు, అక్రమ వలసదారులంతా 2014కు ముందు వలస వచ్చిన వాళ్లే
- మోదీ పాలనలో అక్రమ చొరబాట్లను అడ్డుకున్నాం
- ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి
- బంగ్లా, పాకిస్తాన్ నుండి వలస వచ్చిన ముస్లిం ఓట్లను తొలగిస్తే తప్పేంటి?
- బెంగాల్ లో ఆ ఓట్లను మాత్రమే తొలగించాం
- బెంగాల్ లో రిగ్గింగ్ కు తావు లేకుండా పోలింగ్ జరిగింది
- ప్రజా తీర్పుతోనే అక్కడ బీజేపీ పాలన వచ్చింది
- ముస్లింలారా... మీ ఓట్లు ఉండేలా చూసుకోండి
- దేశం కోసం తపన పడేవాళ్లెవరో ఆలోచించండి
- మోదీ పాలనా విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- దేశ సుస్థిర పాలనకు మద్దతివ్వండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు
- కరీంనగర్ లో "మేధావుల సదస్సు"కు హాజరైన కేంద్ర మంత్రి

కరీంనగర్ వెలుతురు జూన్ 21:

12 ఏళ్ల పాలనలో భారత దేశ గతినే మార్చేసిన మహనీయుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. 12 ఏళ్ల మోదీ పాలన ఒక్క అవినీతికి తావులేకుండా సుస్థిర పాలనతో భారత్ ను అగ్ర రాజ్యాల సరసన చేర్చి భారతదేశ గతినే మార్చేశారని అన్నారు. డిజిటల్ ఇండియా విషయంలో విప్లవం సృష్టించారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ సునామీ సృష్టించారని చెప్పారు. సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు మోదీ అని కొనియాడారు. కిసాన్ సమ్మాన్ నిధి, ఎరువుల సబ్సిడీ, కిసాన్ క్రెడిట్, ఇన్సూరెన్స్, భూసార పరీక్షలతో రైతుల జీవితాలను మార్చే దిశగా అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. దేశంలోకి వచ్చిన రోహింగ్యాలు, అక్రమ చొరబాటుదారులంతా 2014కు ముందు వలస వచ్చిన వాళ్లేనని చెప్పారు. మోదీ పాలనలో అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపారన్నారు. సర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. బంగ్లా, పాకిస్తాన్ నుండి బెంగాల్ కు అక్రమంగా వలస వచ్చిన ముస్లిం ఓట్లను తొలగిస్తే తప్పేంటని ప్రశ్నించారు. తెలంగాణలోనూ నిజమైన పౌరుడి ఓట్లను తొలగించే అవకాశమే లేదన్నారు. ముస్లింలుసహా ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అక్రమ చొరబాటుదారుల ఓట్లను, దొంగ ఓట్లను కచ్చితంగా తొలగించాల్సిందేనన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్స్ లో నిర్వహించిన ''మేధావుల సదస్సు''లో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, ఎల్ఐసీ సౌత్ జోన్ అధ్యక్షులు రాజయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆకుల శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు.

ఒక ప్రభుత్వ పాలనను, దేశ ప్రధాని నాయకత్వ సామర్థ్యాన్ని చరిత్ర ఎలా అంచనా వేస్తుంది? ఆ పాలనకు ముందు 1. భారత్ ఎట్లుండే... ఇప్పుడెట్లా మారింది? 2. ప్రపంచమంతా భారత్‌ను ఎలా చూస్తోంది? 3. ఆ పాలనవల్ల సాధారణ పౌరుడి జీవితం ఏమైనా మారిందా? దేశ దిశ-దశను మార్చగలిగిందా? ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచగలిగిందా? అనేది ముఖ్యం. చరిత్రలో ఎంతో మంది ప్రధానులు ప్రభుత్వాలను నడిపారు. టర్మ్ అయిపోగానే వెళ్లిపోయారు. కానీ దేశ దిశ దశను మార్చిన మహానాయకుడు ఎవరంటే కచ్చితంగా మోదీనే. భారత్ పేరు వింటే అభివృద్ధి చెందుతున్న దేశమనే ఇన్నాళ్లు చెప్పుకున్నాం. కానీ మోదీ పాలనలో ''భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించింది. ఆర్థిక ప్రగతిలో 4వ స్థానానికి చేరుకుంది. నాడు ప్రపంచ దేశాలకు భారత్ అంటే చులకన. నేడు రెడ్ కార్పెట్ పరిచి మన ప్రధానికి విదేశాలకు సెల్యూట్ చేసే పరిస్థితి వచ్చింది.2014కు ముందు యూపీఏ పాలనంతా 2జీ స్కాం, 3జీ స్కాం, బొగ్గుసహా రోజుకో అవినీతి కుంభకోణమే. పంచ భూతాలను అవినీతిమయం చేశారు. బలహీనమైన ప్రధాని. బలహీనమైన నిర్ణయాలు , విధాన నిర్ణయాల్లో శూన్యత, ప్రపంచ వేదికపై అత్యంత పరిమిత ప్రభావం భారత్ ది. ఎన్డీఏ 12 పాలనలో పరిస్థితి పూర్తిగా మారింది. అవినీతిరహిత పాలన కొనసాగుతోంది. బలమైన ప్రధానమంత్రి ఉన్నారు. విధాన నిర్ణయాల్లో తెగువ చూపుతున్నారు. ప్రపంచ రాజకీయాల్లో కీలక శక్తిగా భారత్ ఎదిగింది. దూరదృష్టి, ధైర్యం, మోదీ నాయకత్వమే కారణం. ప్రధాని పదవి అంటే కొన్ని కుటుంబాలకే పరిమితం అనే స్థితినుండి సామాన్యుడు కూడా ప్రధాని కావొచ్చని నిరూపించిన నేత మోదీ.

సామాన్యుడి సాధించిన విజయాలను విశ్లేషిస్తే....

1.పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహార భద్రత... 15 కోట్ల ఇళ్లలో టాయిలెట్లు... 11 కోట్ల ఉజ్వల కనెక్షన్లు ఇచ్చాం. 4 కోట్ల ఇండ్ల నిర్మాణం పూర్తి. మరో 3 కోట్ల ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం. ప్రతి ఇంటికి తాగునీరు... 58 కోట్ల జన్ ధన్ ఖాతాలు... ఇవన్నీ పేదవాడి జీవితానికి గౌరవం తెచ్చాయి.

2. డిజిటల్ ఇండియా – ప్రపంచానికి భారత మోడల్. నాడు బ్యాంకు ఖాతాయే లేని పేదవాడు ఇయాళ మొబైల్ ఫోన్‌తో నేరుగా ప్రభుత్వ నిధులు పొందుతున్నాడు. లావాదేవీలన్నీ ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంతో జరుపుతున్నారు.

3.అవినీతి నియంత్రణ...కాంగ్రెస్ పాలనలో "ఢిల్లీ నుంచి రూపాయి పంపితే పేదవాడికి 15 పైసలే చేరేది... DBTతో సంక్షేమ పథకాల డబ్బు నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోనే జమ. నో బ్రోకర్స్.. నో కరప్షన్... JAMతో(జన్ ధన్-ఆధార్-మొబైల్) ద్వారా ఏకంగా 51 లక్షల కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేసి అవినీతి రహిత వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత మోదీగారిదే.

4.ప్రపంచ వేదికపై భారత గౌరవం....ప్రపంచ రాజకీయాల్లో ''జీ హుజూర్'' అనే స్థాయి నుండి అగ్ర రాజ్యాల "నిర్ణయాలను సైతం ప్రభావితం చేసే దేశం"గా భారత్ మారింది. G20 అధ్యక్షత, అంతర్జాతీయ సౌర కూటమి, గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించాం. విదేశాల్లో యుద్ధాలు జరిగితే ఆపి భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చినం.

5.జాతీయ భద్రత.....భారత్ శాంతిని కోరుకుంటుంది. కానీ బలహీనత కాదు. అంతర్గత భద్రతకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను కూకటి వేళ్లతో పెకలించి వేస్తున్నారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహదేవ్, పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి దాడులతో ఉగ్రవాదానికి వార్నింగ్ ఇచ్చి సత్తా చాటాం.

6.ఆత్మనిర్భర్ భారత్.... దిగుమతుల స్థాయి నుండి స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా నినాదంతో విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి వచ్చాం. ఆత్మనిర్భర భారత్ పేరుతో 20 లక్షల కోట్లు కేటాయించి 2 లక్షల స్టార్టప్ లు, కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాం. 2014 లో కేవలం 2 మొబైల్ కంపెనీలు ఉంటే నేడు 300 కు పైగా మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటు. మౌలిక సదుపాయాల బడ్జెట్‌ను 2 లక్షల కోట్ల నుండి 12 లక్షల 20వేల కోట్లకు పెంచినం.

7..మౌలిక సదుపాయాల విప్లవం సృష్టించాం. రోడ్లు, రైల్వేలు, విమాన రంగాల్లో పెను మార్పులు తెచ్చారు. 2014 నాటికి రోడ్ల బడ్జెట్ 31 వేల కోట్లుంటే నేడు ఏటా 3 లక్షల కోట్లు కేటాయిస్తున్నారు. 12 ఏళ్లలో 91 వేల కి.మీ.కు పైగా హైవేల నిర్మించారు. డొక్కు రైళ్లు, కంపు కొట్టే టాయిలెట్ల నుండి వందే భారత్ యుగం తీసుకొచ్చారు. అమ్రుత్ భారత్ పేరుతో రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. 2014లో మెట్రో రైళ్ల నెట్‌వర్క్ 248 కి.మీ మాత్రమే... 2026 నాటికి 1,155 కి.మీలకు విస్తరించారు. గతంలో దేశంలో 74 ఆపరేషనల్ ఎయిర్‌పోర్టులుంటే నేడు 165 ఎయిర్‌పోర్టుల ఏర్పాటు చేసినం. చిన్న పట్టణాలకు ఎయిర్ కనెక్టివిటీ సౌకర్యం కల్పిస్తున్నారు. విమానాశ్రయాల విస్తరణ కోసం 1 లక్షా 40 వేల కోట్లకు పైగా పెట్టుబడులు. చిన్న పట్టణాలకు కూడా విమాన సదుపాయాలు. యూపీఏ హయాంలో 2014న మౌలిక సదుపాయాలకు సుమారు 2 లక్షల కోట్లు ఖర్చు పెడితే...2026-27లోనే ఏకంగా 12.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా మౌలిక సదుపాయాలు నిర్మిస్తున్న దేశంగా భారత్ నిలిచింది.

8. రైతు సంక్షేమం....దాదాపు 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 5 లక్షల కోట్ల PM-కిసాన్ నిధి జమ. పంటల బీమా, ఎరువుల సబ్సిడీ పేరిట రైతు కుటుంబాలకు ప్రత్యక్ష సాయం అందుతోంది. ఎరువుల సబ్సిడీ పేరుతో 12 లక్షల కోట్లు ఖర్చు. వడ్లు, పత్తిసహా పంటలకు కనీస మద్దతు ధర రెట్టింపు.

9.మహిళా సాధికారత.... ఉజ్వల కనెక్షన్లు, ముద్రా రుణాలు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా రిజర్వేషన్ చట్టం... మహిళా అభివృద్ధి కేంద్రబిందువుగా చట్టాలు. ఇల్లు మంజూరు. మహిళా సాధికారత.

తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులు......12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేసినం. పన్నుల వాటా 1 లక్షా 18 వేల కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద 1 లక్ష కోట్లు ఇచ్చినం.కేంద్రమే వడ్డీ భరిస్తూ 50 ఏండ్ల వడ్డీ లేని రుణం కింద తెలంగాణకు దాదాపు 10 వేల కోట్ల సాయం. యూపీఏతో పోలిస్తే బడ్జెట్ ఏకంగా 20 రెట్ల పెంపు. 2014లో తెలంగాణకు రైల్వే బడ్జెట్ 258 కోట్లు. నేడు 5 వేల 5 వేల 336 కోట్లు కేటాయింపు. వంద శాతం రైల్వే లేన్ల విద్యుదీకరణ పూర్తి. 413 కోట్లతో చర్లపల్లి కొత్త టెర్మినల్ స్టేషన్‌ను నిర్మించినం. 40 రైల్వే స్టేషన్లు 'అమృత్ స్టేషన్లు'గా నిర్మాణం. 5 వందే భారత్ రైళ్లు ప్రయాణం. త్వరలో మరో 3 బుల్లెట్లు రైళ్లు ప్రయాణించబోతున్నాయి.

తెలంగాణలో హైవేస్ విషయానికొస్తే.. 12 ఏళ్లలో 5 వేల కిలోమీటర్ల కుపైగా హైవేల నిర్మాణం. 31 వేల కోట్లు ఖర్చు. భారత్‌మాల కింద 38 వేల 297 కోట్లతో 1,719 కిలోమీటర్ల మేర హైవే కారిడార్లను మంజూరు చేసినం. ఓవరాల్ గా హైవేల కోసమే కేంద్రం లక్షా 15 వేల కోట్లు ఖర్చు చేసింది. రైతాంగం, విద్య, వైద్య రంగాల విషయానికొస్తే.... నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు చేశారు. 1350 కోట్లతో బీబీనగర్ లో ఎయిమ్స్ (AIIMS) ఏర్పాటు, ములుగులో ట్రైబల్ వర్సిటీ ఏర్పాటు. కాజీపేటలో 500 కోట్లతో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు. టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేశారు. 7 జిల్లాల్లో కొత్త నవోదయ విద్యాలయాల మంజూరు. 1 కోటి 32 లక్షల మందికి జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు తెరిపించినం. 'జల్ జీవన్ మిషన్' తో 53 లక్షల 90 వేల గ్రామీణ ఇండ్లకు సురక్షితమైన తాగునీటి సరఫరా చేసినం. పీఎం కిసాన్ కింద తెలంగాణలోని 30 లక్షల 40 వేల మంది రైతులకు ఏటా 6 వేల చొప్పున చెల్లింపు. 11 లక్షల 80 వేల మందికి ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినం. ఉపాధి కోసం ముద్రా స్కీమ్ కింద 86 వేల 8 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. తెలంగాణే కాదు... అన్ని రాష్ట్రాల అభివృద్ధికి మోదీగారు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులు ఈశాన్య రాష్ట్రాలకే. వారసత్వ రాజకీయాలకు భిన్నం. ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి ప్రధాని అయితే దేశాన్ని ఎంత క్రమశిక్షణతో నడపవచ్చో మోదీ గారు నిరూపించారు. కారణ జన్ముడు మోదీగారికి భగవంతుడి ఆశీస్సులు పుష్కలంగా దక్కాలి. వడ్ల కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవానికి ప్రతి గింజను కేంద్రమే కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం మధ్య దళారి మాత్రమే. కొనుగోలు చేసి కేంద్రానికి అప్పగించినందుకు కమీషన్ కూడా చెల్లిస్తున్నాం. అయినా వడ్లు కొనడం లేదని చెప్పడం బాధాకరం. వాస్తవానికి పంట చేతికొచ్చే సమాయానికి ముందే కేంద్రం ప్రతి రాష్ట్రం నుండి వడ్ల కొనుగోలుపై ప్రతిపాదనలు కోరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మేరకే వడ్లను కొనుగోలు చేస్తోందన్నారు. ప్రతిపాదనలు సరిగా పంపకుండా కేంద్రంపై నెపం నెట్టడం దుర్మార్గం.ఈ నేపథ్యంలో మోదీ గారి 12 ఏళ్ల పాలనలో దేశానికి జరిగిన మేలును సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరుతున్నా. మోదీ పాలనకు బహిరంగంగా మద్దతిచ్చి ఆశీర్వదించండి. ఈ దేశ భవిష్యత్తు కోసం, సుస్థిర పాలన కోసమైనా మోదీగారికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని మేధావులను కోరుతున్నా...

మారుతున్న వాతావరణం...

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం వేగంగా మారుతోంది. ఒకవైపు ఎండల తీవ్రత కొనసాగుతున్నప్పటికీ, మరోవైపు పలు ప్రాంతాల్లో వానలు దంచికొడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఇంకా వర్షాలు పడటం లేదు. అయితే, ప్రస్తుతం ఏర్పడిన ద్రోణి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు వాతావరణంలో పెను మార్పులు సంభవించనున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆకాశం మేఘావృతమై ఉండి, చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయని తెలిపారు. నైరుతి రుతుపవనాల కదలికలకు తోడు ద్రోణి ప్రభావం బలంగా ఉండటమే ఇందుకు కారణమని వాతావరణ కేంద్రం పేర్కొంది.తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తుగా 'ఎల్లో అలర్ట్' ప్రకటించారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కుండపోత వానలు పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని స్థానిక యంత్రాంగాలు హెచ్చరించాయి.రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు వర్ష సూచన ఉన్నప్పటికీ, ఉత్తర మరియు తూర్పు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆదివారం, సోమవారం తీవ్రమైన వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినా భూగర్భంలో ఉన్న వేడి కారణంగా పగటిపూట ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయని, దీనివల్ల ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. శనివారం నాటి లెక్కల ప్రకారం తెలంగాణలోని సుమారు 28 జిల్లాల్లో పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదై జనాలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో రోడ్లన్నీ నిర్జనంగా మారుతున్నాయి. జూన్ నెల సగం దాటినా ఎండల వేడి తగ్గకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.రాష్ట్రంలో ఆదివారం నమోదైన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో అత్యధికంగా 43.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. ఎండలతో జనాలు అల్లాడిపోతుండగా, మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఏకంగా 7.4 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. ఇలా ఒకే రోజున ఒకచోట ఎండలు, మరోచోట భారీ వర్షాలు కురవడం వాతావరణంలో వస్తున్న మార్పులకు అద్దం పడుతోంది.రాజధాని హైదరాబాద్ నగరంలో పగటిపూట తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో నగరవాసులు ఇబ్బంది పడ్డారు. అయితే రాత్రి 8 గంటల తర్వాత నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశంలో దట్టమైన నల్లటి మబ్బులు కమ్ముకుని, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన మొదలైంది. రాత్రి వేళ కురిసిన ఈ అకాల వర్షంతో నగరంలో వేడి తగ్గి కాస్త ఉపశమనం లభించినట్లయింది.హైదరాబాద్‌లోని పలు ప్రధాన ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ తదితర ఏరియాల్లో శనివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా భారీ వాన పడటంతో డ్రైనేజీలు పొంగిపొర్లి ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. రోడ్లపై మోకాళ్లోతు నీరు చేరడంతో వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ఐటీ ఉద్యోగులు, సాధారణ ప్రజలు గమ్యస్థానాలకు చేరడానికి గంటల సమయం పట్టింది. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించడానికి మరియు విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించడానికి జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు, ట్రాఫిక్ పోలీసులు అర్ధరాత్రి వరకు శ్రమించి పరిస్థితిని చక్కదిద్దారు. రాబోయే మూడు రోజులు కూడా నగరంలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున జీహెచ్ఎంసీ సిబ్బందిని అధికారులు అలర్ట్ చేశారు.

కాంగ్రెస్ సంస్థాగత బలోపేతమే లక్ష్యం: పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

- అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదుకు సూచన

ప్రజా సమస్యలపై చురుగ్గా పనిచేయాలని దిశానిర్దేశం

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో ఆదివారం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించగా, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, టీపీసీసీ ట్రైనింగ్ ఇన్‌చార్జ్ రాంమోహన్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు సంస్థాగత విస్తరణ, కార్యాచరణపై దిశానిర్దేశం చేసిన మహేష్ కుమార్ గౌడ్, సమన్వయంతో పనిచేస్తూ సంఘటన్ సృజన్ అభియాన్‌ను విజయవంతం చేయాలని, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నేడే భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో...

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, వెలుతురు జూన్ 21:

పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం (జూన్ 22న) యాదాద్రి - భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా బౌద్ధ క్షేత్రాలైన ఫణిగిరి, గాజులబండలో సంరక్షణ, పునరుద్ధరణ పనులను మంత్రి ప్రారంభించనున్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో చేపట్టిన భువనగిరి కోట అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు.

పర్యటన సాగనుందిలా...

ఉదయం 8:00 - 9:00 గంటలకు భువనగిరి కోట అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారు. అనంతరం పనుల పురోగతిపై సమీక్షించనున్నారు. ఉదయం 11:00 గంటలకు సూర్యాపేట జిల్లాలోని ప్రసిద్ధ ఫణిగిరి బౌద్ధ క్షేత్రంలో సంరక్షణ, పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తారు.మధ్యాహ్నం 12:45 - 1:15 గంటలకు గాజులబండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించి, సంరక్షణ, పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:45 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు కొలనుపాకలోని సోమేశ్వరాలయాన్ని సందర్శించి, పర్యాటక, వారసత్వ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష నిర్వహిస్తారు.

భారత్ యోగ భూమి

- నేటి జీవన శైలి వ్యాధులకు యోగా పరిష్కారం
- 190 దేశాల ప్రజలు యోగా చేస్తున్నారు
- యోగా మన జీవన విధానం
- ప్రపంచ శ్రేయస్సుకు యోగాను అనుసంధానం చేసిన ఘనత మోదీదే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- కరీంనగర్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి
- ప్రతి రోజు దినచర్యలో యోగా భాగం చేసుకోవాలని బండి పిలుపు
- నీట్ రీఎగ్జామ్ రాస్తున్న విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పిన కేంద్ర మంత్రి

కరీంనగర్ వెలుతురు జూన్ 21:

భారతదేశం ''యోగ భూమి''గా ప్రపంచ దేశాలన్ని గుర్తింపు ఇచ్చాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నేడు ప్రపంచమంతా ఒత్తిడి, ఆందోళనతోపాటు జీవన శైలి వ్యాధులతో బాధపడుతున్నారని, వీటికి సరైన పరిష్కారం నిత్యం యోగా చేయడమేనని చెప్పారు. ప్రతిరోజు దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ లో నిర్వహించిన యోగా వేడుకల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, అది మనిషి శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే జీవన విధానం. మన శరీరం, మనస్సు, ఆలోచనలు, ఆత్మ మధ్య సమన్వయం సాధించడమే యోగా ప్రధాన లక్ష్యం.ప్రపంచంలో ప్రతి దేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. కొన్నిదేశాలు టెక్నాలజీకి ప్రసిద్ధి చెందాయి. మరికొన్ని ఆర్థిక శక్తిగా ఎదిగాయి. కానీ భారతదేశానికి ప్రపంచం ఇచ్చిన అత్యున్నత గుర్తింపు ఏమిటంటే భారత్ ఒక "యోగభూమి". యోగా పుట్టింది భారతదేశంలో. ప్రపంచానికి యోగాను అందించింది భారతీయ సంస్కృతి. వేల సంవత్సరాల క్రితం మన ఋషులు ప్రకృతితో మమేకమై జీవిస్తూ ఆరోగ్య రహస్యాలను కనుగొన్నారు. వారు మనకు అందించిన అమూల్యమైన కానుకే యోగా.నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలైన ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, జీవన శైలి వ్యాధులకు మందుల కంటే ముందు యోగా ఒక సహజ పరిష్కారంగా నిలుస్తోంది. యోగా కోసం ఖరీదైన పరికరాలు అవసరం లేదు. ఎటువంటి పెట్టుబడి అవసరం లేదు. కావాల్సింది కేవలం సంకల్పం మాత్రమే.ప్రతిరోజూ కొద్దిసేపు యోగా

చేస్తే శరీరం బలంగా ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. పనితీరు మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీవితంలో సానుకూలత పెరుగుతుంది. ఇంత మంచి ఫలితాలు ఉన్నాయి కాబట్టే ఇవాళ ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు కూడా యోగాను ప్రోత్సహిస్తున్నారు.కరోనా మహమ్మారి సమయంలో యోగా, ప్రాణాయామం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో ప్రపంచమంతా గుర్తించింది. ఈ రోజు మనం యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, జీవితంలో భాగంగా మార్చుకోవాలి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు యోగాకు కేటాయిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం. "యోగ చేస్తే రోగం

దూరం" అనే నినాదాన్ని మన జీవితంలో ఆచరణలో పెట్టుకుందాం.ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో యోగా ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారింది. 2014లో ఐక్యరాజ్యసమితి వేదికపై భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ యోగా దినోత్సవాన్ని ప్రకటించాలని ప్రతిపాదిస్తే కేవలం 90 రోజుల్లోనే 177 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడం ప్రపంచ చరిత్రలో ఒక విశేషం. ఫలితంగా ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. నేడు 190కు పైగా దేశాల్లో వందల కోట్ల మంది యోగా చేస్తున్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు, జపాన్ నుంచి బ్రెజిల్ వరకు యోగా ఆరోగ్యానికి మార్గదర్శిగా మారింది. "ఒక భూమి – ఒక ఆరోగ్యం కోసం యోగా" వంటి సందేశాల ద్వారా మోదీగారు యోగాను ప్రపంచ శ్రేయస్సుతో అనుసంధానం చేశారు. ఇది భారతదేశానికి గర్వకారణం.ఆరోగ్యానికి యోగా ఒక అద్భుతమైన మార్గం. అందరం ప్రతిరోజూ యోగా చేద్దాం. ఆరోగ్యంగా జీవిద్దాం... భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇకపై ప్రతి కుటుంబ దిన చర్యల్లో యోగా ఒక భాగం కావాలని కోరుకుంటున్నా.ఆదివారం రోజున నీట్ రీ ఎగ్జామ్. పరీక్ష రాయబోయే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్. పరీక్షకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు జరిగాయి. పరీక్ష రాయబోయే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొద్దున్నే యోగా కార్యక్రమాలను పూర్తి చేసుకున్నాం.

వీబీజీ రామ్‌జీ చట్టం-2025పై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

- గ్రామీణ ఉపాధి, రాష్ట్రాల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- విపక్ష పాలిత రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం
- న్యాయపరంగా, రాజ్యాంగపరంగా సవాల్ చేసే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయం

హైదరాబాద్, వెలుతురు జూన్ 21:

వీబీజీ రామ్‌జీ చట్టం–2025 అమలుతో ఏర్పడే ప్రభావాలు, రాష్ట్రాలపై పడే ఆర్థిక భారం, గ్రామీణ ఉపాధి హామీ పథక భవిష్యత్తు తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శనివారం నాడు జరిగింది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు డా.దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, డా. వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరై వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.వీబీజీ రామ్‌జీ చట్టం–2025 అమలుతో గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై సబ్ కమిటీ విస్తృతంగా చర్చించింది. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించింది. ముఖ్యంగా ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాల్సిన అవసరంపై సభ్యులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాక్టికల్‌గా అమలు చేయడం సాధ్యం కాదని సమావేశంలో అభిప్రాయపడింది. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో

పాటు కూలీ రేట్లపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవన భద్రతకు ఇది విఘాతం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సముచితం కాదని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. దేశ గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును అందించిన చారిత్రాత్మక పథకానికి గాంధీజీ పేరు కొనసాగాలని సభ్యులు పేర్కొన్నారు.రాజ్యాంగంలోని సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం అప్రజాస్వామికమని సమావేశంలో అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సభ్యులు పేర్కొన్నారు. ఆర్టికల్ 258(3) ప్రకారం..రాష్ట్రాలపై కేంద్రం అదనపు భారం మోపే పక్షంలో..రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాల్సి ఉంటుందని రాజ్యాంగం స్పష్టం చేస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. 16 ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులు, రాష్ట్రాల ఆర్థిక హక్కులు హరించే విధంగా ఉన్నాయని, మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాలకు నష్టం చేసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళుతున్న ప్రతి రూపాయికి తిరిగి 40 పైసలే వెనక్కి వస్తుందని..అలాంటప్పుడు వీబీజీ రామ్ జీ పేరుతో 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రంపై మోపడం ఆమోదయోగ్యం కాదన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టాన్ని న్యాయపరంగా, రాజ్యాంగపరంగా సవాల్ చేసే అవకాశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ విషయంలో న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు విపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. కర్ణాటక, కేరళ, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలతో మాట్లాడి ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.వీబీజీ రామ్‌జీ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రాలు విడివిడిగా కాకుండా ఉమ్మడిగా తమ నిరసనను వ్యక్తం చేయాలని, అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాల వారీగా అధ్యయనం కొనసాగించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించనున్నట్లు వెల్లడించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీ ఎస్ దానకిషోర్, కమీషనర్ దివ్యా దేవరాజన్, స్పెషల్ కమీషనర్ శ్రీ లక్ష్మీ, జాయింట్ కమీషనర్ నరసింహులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రి బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా బుల్లెట్ మాధురి చంద్ర

- రెండోసారి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వం
- తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీ
- బలోపేతం వరకు సేవలకు గుర్తింపు

యాదాద్రి భువనగిరి వెలుతురు జూన్ 21:

యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాజపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన శ్రీమతి బుల్లెట్ మాధురి చంద్రను పార్టీ అధిష్ఠానం రెండోసారి నియమించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మాధురి చంద్ర విద్యార్థులను ఉద్యమం వైపు చైతన్యపరిచేందుకు విశేషంగా కృషి చేశారు. తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యమ విజయానికి తన వంతు సహకారం అందించారు.రాజకీయ జీవితంలో మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన ఆమె గతంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. అనంతరం 2024లో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు.పార్టీ పట్ల ఆమె చూపిన నిబద్ధత, మహిళా సాధికారత కోసం చేసిన కృషి, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటం, పార్టీ అభివృద్ధికి అందించిన సేవలను గుర్తించిన నాయకత్వం మరోసారి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలి బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.ఇప్పటివరకు అప్పగించిన ప్రతి బాధ్యతను విజయవంతంగా నిర్వహించిన మాధురి చంద్ర కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకత్వాల ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ అభివృద్ధి, మహిళల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని మాధురి చంద్ర ఈ సందర్భంగా తెలిపారు. తనపై మరోసారి నమ్మకం ఉంచిన బీజేపీ నాయకత్వానికి, పార్టీ కుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలి

- యోగా గొప్పతనం ప్రపంచానికి తెలిసేలా కృషి చేస్తున్నాం
- హెల్తీ తెలంగాణ కోసం కృషి చేస్తున్నాం
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం – ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు నిర్వహించిన యోగా సాధనలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప కానుక యోగ అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే హెల్తీ ఫ్యామిలీ, హెల్తీ సోసైటీ, హెల్తీ తెలంగాణ ఉండాలన్నారు. పాఠశాల నుంచి కాలేజీ స్థాయి వరకు విద్యార్థులకు యోగాను పరిచయం చేస్తున్నామన్నారు. యోగ గొప్పతనాన్ని అందరికీ తెలిసేలా కృషి చేస్తున్నామన్నారు.ఆయుష్ శాఖ ద్వారా యోగ శిక్షణ రాష్ట్రంలో ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హనుమంతు, డైరెక్టర్ స్పోర్ట్స్ సోనీ బాలాదేవి, మెడికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా. రవీంద్ర కుమార్, ఆయుష్ శాఖ అధికారులు హైదరాబాద్ జిల్లా DMHO డా. పుట్ల శ్రీనివాస్, యోగ శిక్షకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ!

నారాయణపేట, వెలుతురు జూన్ 21:

ధన్వాడ మండల కేంద్రంలోని ఆగ్రో, హాకా రైతు సేవా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా దుకాణాలలో ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్లను, ఇతర రసాయనిక ఎరువులు, పురుగుల మందుల నిల్వలను ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం దుకాణాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా చెక్ చేశారు.ప్రస్తుత సీజన్‌లో

రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అక్కడి డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే గోదాముల్లో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, ధన్వాడ తహసిల్దార్ సింధూజ, ఎంపీడీవో అబ్జల్, ఏవో నవీన్ కుమార్, ఆర్. ఐ. నిఖిల్ తో పాటు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌జీ కళాశాలలో ఎస్పీ తనిఖీలు!

నల్గొండ, వెలుతురు జూన్ 21:

నల్గొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ రీ–ఎగ్జామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదివారం సందర్శించి తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడటంలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియలను ఆయన స్వయంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 అమలులో ఉందని, కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడటం లేదా అనవసరమైన రద్దీ సృష్టించడం చేయవద్దని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.పరీక్షా ప్రక్రియ ముగిసే వరకు విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అంతా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, పరీక్షా పత్రాలు, సామాగ్రిని భద్రతా గదికి చేర్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల పారదర్శకత, భద్రత

విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, అభ్యర్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షకు హాజరయ్యేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎస్పీ పేర్కొన్నారు.

తండ్రి కుటుంబ సౌధానికి అచంచలమైన పునాది

ప్రకృతి సృష్టించిన అద్భుతమైన బంధాలలో తండ్రి బంధం చాలా ప్రత్యేకమైనది. తల్లి ప్రేమ ఒక తీపి జ్ఞాపకం అయితే, తండ్రి ప్రేమ ఒక సురక్షితమైన నీడ. ఒక కుటుంబంలో తండ్రి పాత్ర కేవలం ఆదాయాన్ని సంపాదించే వ్యక్తిగా మాత్రమే పరిమితం కాదు; ఆయన ఒక మార్గదర్శి, రక్షకుడు, మరియు కుటుంబానికి ఒక ధైర్యస్తంభం. ఫాదర్స్ డే అనేది ఆ నిశ్శబ్ద త్యాగమూర్తికి మనం కృతజ్ఞతలు చెప్పుకునే ఒక ప్రత్యేక సందర్భం.

తండ్రి - ఒక బాధ్యతాయుతమైన శిల్పి

శిలను శిల్పంగా మలచడానికి శిల్పి ఎంత శ్రమిస్తాడో, తన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి తండ్రి అంతకు మించిన శ్రమను పడతాడు. సమాజంలో పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి, వారికి క్రమశిక్షణను, విలువలను మరియు బాధ్యతను తన ప్రవర్తన ద్వారా నేర్పిస్తాడు. తండ్రి వేసే అడుగులు పిల్లలకు దారిని చూపే దీపాలుగా మారుతాయి. ఆయన చేసే ప్రతి పనిలోనూ తన పిల్లల సుఖ సంతోషాలే లక్ష్యంగా ఉంటాయి.

త్యాగం - ఆయన జీవితాంతపు ఆభరణం

ఒక తండ్రి తన జీవితంలో ఎన్ని ఆశలను, ఎన్ని కోరికలను త్యాగం చేస్తాడో ఎవరికీ తెలియదు. కుటుంబం కోసం, పిల్లల చదువుల కోసం తన అవసరాలను పక్కన పెట్టి, ఎండనకా వాననకా కష్టపడతాడు. తన కళ్లలో ఉండే అలసటను చిరునవ్వుతో దాచుకుని, పిల్లల ముఖంలో చిరునవ్వును చూడటమే తన విజయంగా భావిస్తాడు. ఆయన కష్టపడే ప్రతి చమట చుక్క, పిల్లల జీవితంలో ఒక అడుగు ఎత్తుకు చేరుకోవడానికి సహకరిస్తుంది.

భరోసా - "నేనున్నాను" అనే మాట

జీవితం అంటే కేవలం పూలబాట కాదు; అది ఎన్నో కష్టసుఖాల కలయిక. జీవిత ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లు, వైఫల్యాలు, ఒత్తిళ్లు—వీటన్నింటినీ ఎదుర్కొనే ధైర్యాన్ని తండ్రి ఇస్తాడు. బిడ్డలు ఏ పరిస్థితిలో ఉన్నా, "నేనున్నాను, భయపడకు" అని ఆయన ఇచ్చే భరోసా ఒక కొండంత అండగా ఉంటుంది. లోకం మొత్తం ఎదురుతిరిగినా, తండ్రి అండగా ఉంటే ఏ కష్టాన్నైనా జయించగలమనే నమ్మకం పిల్లలకు కలుగుతుంది.

తండ్రి - ఒక నిశ్శబ్ద స్నేహితుడు

బయటకు కఠినంగా కనిపించే తండ్రి వెనుక ఒక సున్నితమైన మనసు ఉంటుంది. మనం పెరిగే కొద్దీ తండ్రి ఒక గురువుగా, స్నేహితుడిగా మారి మనతో మమేకమవుతాడు. మన విజయాలకు ఆయనే మొదటి అభిమాని. మన వైఫల్యాల్లో ఆయన బాధపడినా, పక్కనే ఉండి మళ్ళీ ప్రయత్నించమని ప్రోత్సహిస్తాడు. ఆయన చూపించే ప్రేమలో వాత్సల్యం ఉంటుంది, గద్దించడంలో అర్థవంతమైన క్రమశిక్షణ ఉంటుంది.

నేటి తరంలో తండ్రి పాత్ర

నేటి వేగవంతమైన ప్రపంచంలో తండ్రుల పాత్ర మరింత కీలకంగా మారింది. వృత్తిపరమైన ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, తన పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపడం, వారి ఆసక్తులను ప్రోత్సహించడం, టెక్నాలజీతో పాటు వారు ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా చేయడంలో తండ్రి కీలక పాత్ర పోషిస్తున్నారు. తన పిల్లలను ప్రపంచానికి పరిచయం చేసే వారధి తండ్రి.

మనం ఎంత ఎదిగినా, ఎంతటి గొప్ప స్థాయికి చేరుకున్నా, ఆ విజయాల వెనుక మన తండ్రి పడ్డ శ్రమ, చూపిన మార్గదర్శకత్వం ఎప్పటికీ మరచిపోకూడదు. ఫాదర్స్ డే రోజున ఆయనకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే, ఆయనతో కొద్ది సమయం గడపడం, ఆయన కష్టాలను పంచుకోవడం మరియు ఆయన పట్ల గౌరవాన్ని ప్రకటించడం చాలా ముఖ్యం.కష్టాన్ని చిరునవ్వుతో భరిస్తూ, తన కుటుంబం కోసం నిరంతరం శ్రమించే ప్రతి తండ్రికి—నిజంగా వారే నిజమైన హీరోలు! ఈ ఫాదర్స్ డే సందర్భంగా, మన జీవితాలను వెలుగులతో నింపిన ఆ మహనీయులకు మన హృదయ పూర్వక అభినందనలు తెలియజేద్దాం."నాన్న... నువ్వు మాకు ఇచ్చిన అతిపెద్ద బహుమతి నీ ప్రేమ, నీ మార్గదర్శకత్వం. హ్యాపీ ఫాదర్స్ డే!"

ఈద శేఖర్ 7036997589

యోగ శరీరానికి, మనసుకు ఔషధం

మనస్సుకు శిక్షణ :

నిత్య యోగాభ్యాసం ద్వారా మన ఆలోచనా విధానం క్రమంగా మారుతుంది. కోపం, అసూయ, భయం, ఆందోళన వంటి ప్రతికూల భావాలు తగ్గుతాయి. స్పందించే ముందు ఆలోచించే అలవాటు పెరుగుతుంది. భావోద్వేగ సమతుల్యత ఏర్పడుతుంది.

గుణాలలో మార్పు...

భారతీయ తత్వశాస్త్రం ప్రకారం మనిషి ప్రవర్తన మూడు గుణాలపై ఆధారపడి ఉంటుంది.

సత్వగుణం - ప్రశాంతత, స్పష్టత, కరుణ
రజోగుణం - కోరికలు, అసహనం, ఆవేశం
తమోగుణం - బద్ధకం, అజ్ఞానం, నిరాశ
ప్రాణాయామం, ధ్యానం వంటి సాధనల ద్వారా రజోగుణం, తమోగుణం తగ్గి సత్వగుణం పెరుగుతుంది. ఫలితంగా వ్యక్తిత్వంలో సానుకూల మార్పులు కనిపిస్తాయి.

మీకు మీ కుటుంబ సభ్యులకు అంతర్జాతీయ యోగా దినోత్సవం శుభాకాంక్షలు మీ చుక్క గిరి.

ప్రశాంతంగా ముగిసిన నీట్

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

దేశవ్యాప్తంగా అత్యంత ఉత్కంఠ రేపిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ అండర్ గ్రాడ్యుయేట్ 2026 పునఃపరీక్ష ఆదివారం ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. గతంలో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు, అవకతవకల నేపథ్యంలో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ), కేంద్ర ప్రభుత్వం ఈసారి పరీక్షను సర్వ శక్తులు ఒడ్డి నిర్వహించాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఎగ్జామ్ సెంటర్ల వద్ద మునుపెన్నడూ లేని విధంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రత, పారదర్శకమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ లేదా పొరపాట్లకు తావులేకుండా ఈ పరీక్షను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఎన్‌టీఏ సరికొత్త నమ్మకాన్ని నింపింది.ఆదివారం జరిగిన ఈ మెగా ప్రవేశ పరీక్ష కోసం ప్రపంచవ్యాప్తంగా భారీ ఏర్పాట్లు చేశారు. భారతదేశంలోని 551 ప్రధాన నగరాల్లో ఏర్పాటు చేసిన 5,440 పరీక్షా కేంద్రాలతో పాటు, విదేశాల్లోని మరో 14 కేంద్రాలలో ఈ పరీక్ష ఏకకాలంలో జరిగింది. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షలకు పైగా మంది విద్యార్థులు ఈ పునః పరీక్షకు హాజరయ్యారు. సాధారణ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష సమయం కేటాయించగా, దివ్యాంగులైన అభ్యర్థులకు సాయంత్రం 6.20 గంటల వరకు పరీక్ష రాసేందుకు అదనపు సమయాన్ని కల్పించారు.గతంలో పరీక్షల సమయంలో సోషల్ మీడియా వేదికగా జరిగిన తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు ఈసారి ఐటీ, పోలీస్ విభాగాలు గట్టి చర్యలు చేపట్టాయి. ఇంటర్నెట్, వివిధ సోషల్ మీడియా అకౌంట్లపై ప్రత్యేక నిఘా బృందాలు 24 గంటల పాటు డేగకన్ను వేశాయి. లీకేజీల పేరుతో దళారులు విద్యార్థులను మోసం చేయకుండా ఉండేందుకు స్థానిక ఇంటెలిజెన్స్, క్రిమినల్ ఇంటెలిజెన్స్ విభాగాలను ఎగ్జామ్ సెంటర్ల పరిసరాల్లో మోహరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారిపై కఠినమైన ఐటీ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని పోలీసులు ముందుగానే హెచ్చరించడంతో ప్రశాంత వాతావరణం నెలకొంది.నీట్ రీ-ఎగ్జామ్‌ను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 2 లక్షల మందికి పైగా ప్రభుత్వ, విద్యాశాఖ సిబ్బంది తమ సేవలను అందించారు. అత్యంత కీలకమైన ప్రశ్నపత్రాల తరలింపు (ట్రాన్స్‌పోర్ట్) మరియు రాసిన సమాధాన పత్రాల భద్రత బాధ్యతలను కేంద్ర సాయుధ పోలీసు బలగాలు , స్థానిక పోలీసులు ఉమ్మడిగా భుజాన వేసుకున్నాయి. ప్రతి పరీక్షా కేంద్రం వెలుపల సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారుల పర్యవేక్షణలో భారీగా పోలీసులను మోహరించి అభ్యర్థులను లోపలికి పంపించారు.పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే అభ్యర్థులకు కఠినమైన నిబంధనలను అమలు చేశారు. విద్యార్థులు తమ వెంట కేవలం అడ్మిట్ కార్డు, ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్ వంటివి), పాస్‌పోర్ట్ సైజు ఫోటో మినహా మరే ఇతర వస్తువులను లోపలికి తీసుకెళ్లకుండా కట్టడి చేశారు. చివరికి పెన్నులను కూడా అభ్యర్థులు తెచ్చుకోవడానికి అనుమతించలేదు; ఎన్‌టీఏ సిబ్బంది పరీక్షా గదుల్లోనే అభ్యర్థులందరికీ పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. మూడు అంచెల్లో మెటల్ డిటెక్టర్ల ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అభ్యర్థులను లోపలికి అనుమతించారు.హైటెక్ కాపీయింగ్‌కు ఎక్కడా అవకాశం లేకుండా ప్రతి పరీక్షా కేంద్రంలో అధునాతన సిగ్నల్ జామర్లను మరియు హై-డెఫినిషన్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

రైల్వే మంత్రితో భేటీకి...

(మొదటి పేజీ తరువాయి)

మెట్రో రెండో దశ (ఫేజ్-2) పనులకు కేంద్రం నుంచి రావాల్సిన సహాయం, అనుమతులపై కొద్ది రోజులుగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య తీవ్రస్థాయిలో పొలిటికల్ వార్ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఒక కీలకమైన లేఖ రాయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో పర్యటించనున్నట్లు పేర్కొన్న సీఎం.. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని ఆ లేఖలో కోరారు.హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను స్థానిక బీజేపీ నేతలు, ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారంటూ గత కొన్ని రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధిని కేంద్ర పెద్దల వద్ద తాకట్టు పెడుతున్నారంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తుండటంతో ఈ అంశం కాస్తా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారింది. అయితే, కేవలం విమర్శలకే పరిమితం కాకుండా నేరుగా ఢిల్లీ వేదికగా సమస్యను తేల్చుకోవాలని డిసైడ్ అయిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కిషన్ రెడ్డికే లేఖ రాసి సరికొత్త వ్యూహాన్ని అమలు చేశారు.

తాను రాయబోయే లేఖలో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పెండింగ్ అంశాలను సీఎం ప్రస్తావించారు. మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులు వేగంగా ముందుకు సాగాలంటే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ జోక్యం అత్యంత అవసరమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నెల 22, 23 తేదీల్లో (రేపు, ఎల్లుండి) తాను ఢిల్లీలో అందుబాటులో ఉంటానని, ఈ లోపే కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖాముఖి చర్చలు జరిపేందుకు అపాయింట్‌మెంట్ ఖరారు చేయించాలని కిషన్ రెడ్డిని కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి చొరవ చూపాల్సిన సమయం ఆసన్నమైందని లేఖ ద్వారా గుర్తుచేశారు.హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో, ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి మెట్రో రైలు ప్రాజెక్టు అత్యంత కీలకమైన ప్రజా రవాణా వ్యవస్థ అని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో నొక్కి చెప్పారు. తెలంగాణ ఆర్థిక వృద్ధికి, పట్టణ మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రాజెక్టు వెన్నెముక లాంటిదన్నారు. ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన కొన్ని సాంకేతిక అనుమతులు, నిధుల విడుదల కేంద్ర ప్రభుత్వం వద్దే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరం పరిష్కరిస్తేనే పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయని లేఖలో స్పష్టం చేశారు.తాజాగా రాసిన ఈ లేఖ కొత్తదేమీ కాదని, గతంలోనే తాము కేంద్ర ప్రభుత్వానికి ఈ విషయాలపై స్పష్టమైన నివేదికలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ నెల 16వ తేదీన మెట్రో పెండింగ్ సమస్యలపై కేంద్రానికి రాసిన అధికారిక లేఖను కూడా ఈ సందర్భంగా ఆయన తాజా లేఖలో జతపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల నివేదికలను ఎప్పటికప్పుడు అందిస్తున్నప్పటికీ, కేంద్రం వైపు నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం వల్లే తాను స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చిందని సీఎం వెల్లడించారు.కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో జరగబోయే సమావేశాన్ని కేవలం మర్యాదపూర్వక భేటీగా కాకుండా, అత్యంత ఫలప్రదంగా మార్చుకోవాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని సమగ్ర వివరాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గతంలో జరిగిన ఒప్పందాలు, నిధుల వాటాల పత్రాలు, రూట్ మ్యాప్‌ల కాపీలను తానే స్వయంగా వెంట తీసుకువస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. రైల్వే మంత్రితో జరిగే చర్చల్లో ప్రతి అంశాన్ని పాయింట్ టు పాయింట్ వివరించి, కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం వచ్చేలా ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై చేస్తున్న వరుస రాజకీయ విమర్శలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికే గట్టిగానే స్పందించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చే ఎలాంటి నిధులను అడ్డుకోలేదని, కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ మైలేజ్ కోసం అబద్ధాలు ప్రచారం చేస్తోందని కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిపై, హైదరాబాద్ నగర అభివృద్ధిపై తనకున్న చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని, రాష్ట్రానికి రావాల్సిన ప్రతి పైసాను తీసుకురావడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికే లేఖ రాసి అపాయింట్‌మెంట్ ఖరారు చేయాలని కోరడంతో, ఇప్పుడు కిషన్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సీఎం లేఖపై కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రితో సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తారా? లేదా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ మరో తిరుగులేఖ రాస్తారా? అనే ఉత్కంఠ రేకెత్తుతోంది. ఈ ఇద్దరు నేతల మధ్య నడుస్తున్న ఈ లేఖల యుద్ధం ఎటు దారితీస్తుందోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.ఈ నెల 22, 23 తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి చేపట్టబోయే ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. కేవలం మెట్రో ప్రాజెక్టు మాత్రమే కాకుండా రాష్ట్రానికి సంబంధించిన మరికొన్ని విభజన హామీలు, బడ్జెట్ కేటాయింపులపై కూడా సీఎం కేంద్ర పెద్దలను కలిసే అవకాశం ఉంది. ఒకవేళ కిషన్ రెడ్డి సహకారంతో రైల్వే మంత్రితో భేటీ సాకారమైతే, హైదరాబాద్ మెట్రో విస్తరణ పనులకు లైన్ క్లియర్ అయినట్లేనని భావిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా రేవంత్ రెడ్డి కేంద్రం నుండి ఎలాంటి హామీలు సాధించుకుంటారు అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.

యోగాతోనే ప్రపంచ...

(మొదటి పేజీ తరువాయి)

కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా దేశప్రజలందరినీ అనుసంధానించే ఒక గొప్ప ఆధ్యాత్మిక వారధిగా యోగా మారిందని మోదీ కొనియాడారు.ప్రస్తుత ఆధునిక కాలంలో మారుతున్న అలవాట్ల వల్ల ప్రపంచవ్యాప్తంగా జీవనశైలి వ్యాధులు, తీవ్రమైన మానసిక ఒత్తిడి, అంటురాని దీర్ఘకాలిక రోగాలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మానవాళికి ఒక సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవన మార్గదర్శిగా యోగా నిలుస్తోందన్నారు. రోజువారీ జీవితంలో యోగాను అలవరచుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను సులభంగా సాధించవచ్చని స్పష్టం చేశారు.ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం' అనే ప్రత్యేకమైన థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. వయసు పైబడుతున్నప్పటికీ మనుషుల్లో పని చేసే సామర్థ్యం మరియు ఉత్సాహం తగ్గకూడదనేదే ఈ థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. 20 ఏళ్ల వయసులో ఉన్నదానికంటే 40 ఏళ్లకు శరీరం మరింత ఫ్లెక్సిబుల్‌గా మారాలని, 30 ఏళ్లతో పోలిస్తే 50 ఏళ్ల వయసులో రెట్టింపు ఉత్సాహం ఉండాలని, అలాగే 50 ఏళ్ల కంటే 70 ఏళ్ల వృద్ధాప్యంలో మరింత రోగనిరోధక శక్తిని కలిగి ఉండేలా యోగా మనల్ని మలుస్తుందని మోదీ వివరించారు.మన శరీరాన్ని ఎల్లప్పుడూ చురుగ్గా ఉంచడానికి, మనలోని ఎనర్జీ లెవెల్స్‌ను పెంచడానికి యోగా ఎంతో సహాయపడుతుందని ప్రధాని మోదీ తెలిపారు. జీవితాంతం ఒక నిత్య విద్యార్థిలా కొత్త విషయాలను నేర్చుకునే తత్వాన్ని యోగా మనకు బోధిస్తుందన్నారు. మన గురించి మనం ఎంతగా తెలుసుకుంటే, అంత మెరుగ్గా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోగలమన్నారు. అందుకే ఈ ఏడాది ఎంచుకున్న 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం' అనే అంశం కేవలం ముసలి వారికి మాత్రమే కాదని, బాలలు, యువతీ యువకులు సహా అన్ని వయసుల వారికీ సమానంగా వర్తిస్తుందని మోదీ అభిప్రాయపడ్డారు.కోల్‌కతాలో జరిగిన ఈ కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో పలువురు కీలక ప్రముఖులు పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ తదితరులు ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యోగా గురువులు, వేలాది మంది సాధారణ ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఒకేచోట చేరి క్రమశిక్షణతో ఆసనాలు వేయడం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా

నిలిచింది.భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,500 ప్రధాన ప్రాంతాలలో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న 210కు పైగా భారత రాయబార కార్యాలయాలు దౌత్య మిషన్లు స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, ఆరోగ్యవంతమైన చురుకైన జీవనశైలిపై అంతర్జాతీయ అవగాహన పెంచడంలో యోగా ఒక ప్రపంచ ఉద్యమంగా మారిందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకుంటున్నారు. ప్రధాని మోదీ 2014లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించాలని ప్రతిపాదించగా, రికార్డు స్థాయిలో 175 ప్రపంచ దేశాలు దానికి పూర్తి మద్దతు తెలిపాయి. అనంతరం 2015 జూన్ 21న ప్రపంచంలోనే మొట్టమొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించబడింది. అప్పటి నుండి ఈ రోజు కోట్లాది మంది ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తోంది.

యోగతో ఆరోగ్యకర జీవనం సాధ్యం

- మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి
- అల్వాల్‌లో ఘనంగా యోగా దినోత్సవం
- నిత్యం యోగాతో వ్యాధులకు దూరం
- రోజూ అరగంట యోగా చేయాలని సూచన
- ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు

అల్వాల్ వెలుతురు జూన్ 21:

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా సాధనతో పాటు ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా అసంక్రమిత వ్యాధుల కార్యక్రమ అధికారి డా. చంద్రకళ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని అన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే జీవన విధానమని తెలిపారు.ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను తగ్గించుకోవచ్చని, మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధుల వంటి అసంక్రమిత వ్యాధులను నివారించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రోజుకు కనీసం అరగంట పాటు యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన విధానాలను ప్రదర్శించి వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. లావణ్య రెడ్డి, జిల్లా కార్యక్రమ అధికారులు డా. శ్రీదేవి, డా. నాగరాజ్, ఉప కమిషనర్ బోగేశ్వర్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. గోలి శ్రీకాంత్, ఆయుర్వేద వైద్యాధికారి డా. శ్రీదేవి, హోమియో వైద్యాధికారి డా. అనఘ్, పర్యవేక్షకులు, సహాయక నర్సులు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామంలో సుంకరి సత్యమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న గౌడ సంఘం పెద్దలు

మంచాల వెలుతురు జూన్ 21:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో జరిగిన గీత కార్మికుడు సుంకరి లచ్చయ్యగౌడ్ సతీమణి సుంకరి సత్యమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని సత్యమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించిన గౌడ సంఘం పెద్దలు సభ్యులు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు ఈ కార్య క్రమంలో గౌడ సంగం పెద్దలు చెరుకు నరసింహగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ముద్దం శంకరయ్యగౌడ్ పెద్దగోని శ్రీనివాస్ గౌడ్ మద్దెల కృష్ణగౌడ్ దూసరి రమేష్ గౌడ్ పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్ దూసరి రాజు గౌడ్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం జయశంకర్ పుణ్యమే: జెకె శేఖర్ యాదవ్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 21:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం జయశంకర్ పుణ్యమేనని జెకే శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగద్గిరిగుట్టలోని జయశంకర్ చౌరస్తాలో ప్రొఫెసర్ జయశంకర్ 15 వర్ధంతి సందర్భంగా జెకె శేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ప్రధాన కారణం జయశంకర్ సారే అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడి నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ వస్తనే అవి సాధ్యమైతే అని చెప్పేసి ఎనలేని పోరాటం చేసిన మహానుభావుడు అన్నారు. నిజంగా వారు మన తెలంగాణ జాతిపిత అనడంలో సంశయం లేదు, వారి యొక్క ఆశయాలు ముందుకు తీసుకెళ్దామన్నారు. విశ్వ బ్రాహ్మణులకు వారి కులవృత్తులు చేయడానికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని అదేవిధంగా వారి యొక్క కార్పొరేషన్ కు 1000 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాస్ చారి ప్రధాన కార్యదర్శి మనోహర్ సలహాదారులు బిక్షపతి చారి, రాజు, హనుమంతు చారి, వేణు మధు, రాజుయాదవ్, నాగరాజు యాదవ్, కుమార్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా "అక్షరాల అలువ" పీర్లపండుగ కవి సమ్మేళనం

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

తెలంగాణలో పీర్ల పండుగ. మత సామరస్యానికి ప్రతీక. సబ్బండ కులాల సవార్ల పండుగ మొహర్రం మనుషులంతా ఒక్కతాన ఆడి పాడుకునే సంస్కృతి. ఊరూర పీర్లతో అలాయి నిప్పులతో ఎరుపుదట్టి మెరుపుదట్టి వన్నెల గులాబి దట్టీ అంటూ కలిసిమెలిసి ఆడిపాడే పండుగ పీర్లపండుగ అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక సౌజన్యంతో అలాయి బలాయి కవుల వేదిక ,నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రవింద్రభారతి పైడిజయరాజ్ హాల్ లో వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన కవిసమ్మేళనం సభ జరుగడం అభినందనీయమని అన్నారు.సబ్బండ కులాల సవార్ల పండుగపై కళాకారుల దూల ఆటపాట ప్రతి వూరులో చావిడి పీర్లు అలాయి బలాయి సంతోషంగా ప్రజలు జరుపు కుంటారనితెలిపారు. గోరటివెంకన్న యాకూబ్ , సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కొల్లాపురం విమల, జిలుకర శ్రీనివాస్ పసునూరి రవీందర్ సభలో మనుషులంతా కలిసి మెలిసి పాడే సంస్కృతిని విస్తరించాలని సభలో ప్రసంగించారు.కవిసమ్మేళనం స్కైబాబ బడేసాబ్ ,అధ్యక్షతన కవిసమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా పీర్ల పండుగ మొహరంపై వనపట్ల సుబ్బయ్య రాసిన "అలాయి బలాయి" దివ్య కవితనం డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. పీరీలను తలుస్తూ అక్షరాల అలువ ను కొనియాడుతూ ఈ క్రింది కవులు గానంచేశారు జూపాక సుభద్ర, జ్వలిత, మెర్సీ మార్గరెట్ , సిద్దార్థ, గాజోజు నాగభూషణం, నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, అన్నవరం దేవేందర్, పసునూరి రవీందర్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఒద్దిరాజు ప్రవీణ్, మడిపల్లి రాజ్ కుమార్, బెల్లంకొండ సంపత్ కుమార్, తలారి సతీష్ కుమార్, చెమన్ సింగ్, సుంకర రమేష్, ఉప్పరి తిరుమలేష్, కాంచనపల్లి, కల్వకోలు మద్దిలేటి, తులా శ్రీనివాస్, ఎదిరెపల్లి కాశన్న, అవని శ్రీ, ఇంద్రావత్ రాహుల్ నాయక్, రేఖ పాపని.

హ్యూమెన్ రైట్స్ ప్రజలకు వారధిగా పనిచేయాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 21:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి మహాదేవపురం డివిజన్‌లో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ నవోదయ సిద్దార్థ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో నిస్సహాయులకు, బాధితులకు అండగా నిలవడంలో, మానవ హక్కుల రక్షణలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వ హయాంలో చట్టానికి, మానవ హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా సంస్థ ప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.మహాదేవపురం డివిజన్‌కు విచ్చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ముఖ్య ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సిద్ధనోళ్ళ సంజీవరెడ్డి, గంధం రాములు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రేపు మియాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం: ముఖ్య అతిథిగా కేటీఆర్

- సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేసిన మాజీ కార్పొరేటర్ రంగారావు

కూకట్ పల్లి జూన్ 21 వెలుతురు:

శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం రేపు మియాపూర్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నరేన్ గార్డెన్స్‌లో జరిగే ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శనివారం ఆయన వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మాధవరం నగర్ పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. తొలుత తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా నేతలు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సమావేశంలో రంగారావు మాట్లాడుతూ రేపు జరిగే ఆత్మీయ సమావేశం పార్టీకి ఎంతో ప్రతిష్ఠాత్మకమైనదని స్పష్టం చేశారు. ప్రతి డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఈ సన్నాహక సమావేశంలో నాయకులు మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు సహా పెద్ద సంఖ్యలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశ ఏర్పాట్లు, కార్యకర్తల తరలింపుపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో నూతనంగా ప్రారంభించిన ఓం సాయి జ్యువెలర్స్

- కొత్త కొత్త డిజైన్లు అందుబాటు ధరలు నాణ్యతకు, నమ్మకానికి ప్రతీక

రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 21:

దిల్‌సుఖ్‌నగర్ లో ఓం సాయి జూవేల్లర్స్ నూతన బ్రాంచ్ ఘనంగా ప్రారంభోత్సవం జరిగినది ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మా ప్రత్యేకతలు బంగారం, వెండి ఇతర ఆభరణాలలో అత్యాధునిక డిజైన్లతో మీ ముందుకు వస్తున్నాము.

మా ప్రత్యేకత:

సరికొత్త కలెక్షన్లు అందరికీ అందుబాటు ధరలలో లభించును విశ్వసనీయమైన నాణ్యత కలిగిన జ్యువెలర్స్ అని పదకంటి శ్రీనివాస్ పదకంటి సునీత తెలియజేశారు ఓం సాయి జ్యువెలర్స్ దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ లో నెలకొల్పడం మాకు ఆనందాన్ని, మా ప్రారంభోత్సవానికి మరింత శోభను చేకూర్చింది అని ఈ సందర్భంగా వెల్లడించారు ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు తెలియజేశారు.

ఏపీ నుండి తెలంగాణకు రావాలనుకుంటున్న 891 మంది ఉద్యోగుల విషయంలో పునరాలోచించాలి

- కె. శ్రీకాంత్ అధ్యక్షులు టిఎన్జివోస్ యూనియన్ హైదరాబాద్ సిటీ బ్రాంచ్

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించబడిన ఉద్యోగులను తిరిగి తెలంగాణకు పంపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఖ సంఖ్య GAD 01-APSR0BIF(INST)/26, తేదీ 17.06.2026 ద్వారా (891) మంది ఉద్యోగులను వివిధ కారణాలతో తెలంగాణకు పంపడానికి రాష్ట్ర ప్రభుత్వ సమ్మతిని కోరిన విషయం తెలిసింది.ఈ అంశంపై టిఎన్జివోస్' యూనియన్ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ సమీక్షించి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయాలని కోరుతోంది.ప్రత్యేకంగా, రాష్ట్ర విభజనకు ముందు (2014కు ముందు) నియమించబడిన ఉద్యోగులకే ఈ ఆప్షన్ వర్తింపజేయాలని యూనియన్ అభిప్రాయపడుతోంది. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో నియమించబడిన ఉద్యోగులు తెలంగాణకు రావడానికి అర్హులు కారని స్పష్టం చేసింది.అయితే, సానుభూతి నియామకాల (Compassionate Appointments) విషయంలో, వారి తల్లిదండ్రులు తెలంగాణకు చెందినవారైతే, అలాంటి ఉద్యోగులకు తెలంగాణకు వచ్చే అవకాశం కల్పించాలని యూనియన్ సూచించింది.అలాగే, తెలంగాణ స్థానికులకు మరియు ఫీడర్ కేడర్ ఉద్యోగులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి సమ్మతి తెలపాలని టిఎన్జివోస్' యూనియన్ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ అధ్యక్షులు కె. శ్రీకాంత్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా హయత్ నగర్ నారాయణ హైస్కూల్ లో యోగ డే నిర్వహణ

హయత్ నగర్ వెలుతురు జూన్ 21:

హయత్ నగర్ నారాయణ పాఠశాలలో యోగా డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం జూన్ 21 న "అంతర్జాతీయ యోగా డే" జరుపుకుంటాము. ఈ కార్యక్రమంలో ఏ.జీ.ఎం రవీంద్ర బాబు గారు ప్రిన్సిపల్ లావణ్య రెడ్డి మరియు డీన్ మంజుల ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లావణ్య మాట్లాడుతూ యోగాతో ప్రశాంతత, విశ్రాంతి లభించడమే కాక మానసిక ఆరోగ్యమూ కూడా మెరుగవుతుందని, విద్యార్థులు రోజూ యోగా చేస్తే జ్ఞాపక శక్తి మెరుగై మెదడు చురుగ్గా పని చేస్తుందని, స్థిరమైన యోగాసనాల వల్ల శరీర అవయవాలకు మనసుకు మధ్య సమన్వయం మెరుగై ఏకాగ్రత పెరుగుతుందని, మొదలగు ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పిల్లలకు తమ పూర్తి సహకారాన్ని అందించారు.

ఆరుట్ల గ్రామంలో కీర్తిశేషులు నూతనగంటి రాకేష్ స్మారకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు

- రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్

మంచాల వెలుతురు జూన్ 21:

మంచాల మండలం ఆరుట్లగ్రామంలో నూతన గంటి రాకేష్ స్మారకార్థం గ్రామపంచాయతీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ మంచాల మండలం బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల ర మేష్ రక్తదాన శిబిరాన్ని సందర్శించారు ఈరక్తదాన శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొని ర క్తదానం చేశారు రక్తదానం డొనేట్ చేసిన యువకులను అభినందించిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్ మంచాల మండలం.బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్ ఈసందర్భంగా గ్రా మ సర్పంచ్ శోభ కుమార్ మాట్లాడుతూ ఒక స్నేహితుని జ్ఞాపకార్థంగా యువకులు ముందుకొచ్చి రక్తదానం చేయడం సంతోషకరం అన్నారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాదుగుల బాలమణి కృష్ణగౌడ్ లాలగారి మణెమ్మ రక్తదానం చేసిన యువకులు తదితరులు పా ల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ కనకంటి భూమయ్య గారిని పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

సికింద్రాబాద్– బోయినపల్లి లోని హెకా రిహబ్ సెంటర్ లో బ్రెయిన్ స్ట్రోక్ కు గురై చికిత్స తీసుకుంటున్న ఆందోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు కనకంటి భూమయ్యా గారిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి పై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీ భూమయ్య గారికి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారి ని మంత్రి ఆదేశించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

చౌటుప్పల్ వెలుతురు జూన్ 21:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పైలాన్ పార్క్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యునాని వైద్యాధికారి డాక్టర్ రోజ్ మేరీ యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగ, ధ్యాన సాధనతో శారీరక మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ యోగాసనాలు, ధ్యానం చేసే పద్ధతులను ఈ ఉత్సవంలో పాల్గొన్న వారికి నేర్పించారు. కార్యక్రమంలో ఆయుష్ ప్రకృతి వైద్యశాల యోగ శిక్షకురాలు అశ్విని, విశ్రాంత సామాజిక ఆరోగ్య అధికారి శ్రీరాములు, యోగ సాధకులు పాలకూర్ల సాత్విక్ గౌడ్, వీ. ఝున్సీ తదితరులు పాల్గొన్నారు.

అంజమ్మ మృతి బాధాకరం డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు వెలుతురు జూన్ 21:

మునుగోడు మండలం పలివెల గ్రామం చెందిన గోసుకొండ అంజమ్మ మృతి చెందడం బాధాకరం అని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు పలివెల గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ కుటుంబ సభ్యులైన గోసుకొండ స్వామిని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నికాసైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండదండలు ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు. గ్రామ శాఖ అధ్యక్షులు ఆనగంటి కృష్ణ వార్డు మెంబర్లు బత్తుల ప్రవీణ్ గోసుకొండ మల్లేష్ పాల సెంటర్ చైర్మన్ గోసుకొండ వెంకులు నాయకులు మార్త నర్సిరెడ్డి గోసుకోండ చంద్రయ్య నాతి శేఖర్ గోసుకొండ కృష్ణయ్య వరికుప్పల శంకర్ గజ్జల శీను గోసుకొండ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా పట్ల విద్యార్థులుకు అవగాహన కార్యక్రమం

రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 21:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో విద్యార్థులకు యోగపట్ల అవగాహన కలిగించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడానికి యోగా ఎంతో ఉపకరిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతి ఒక్కరు యోగ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను విని యోగించడం వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేయడమే కాకుండా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది..ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్సిసి అధికారి డాక్టర్ పి. వెంకటేశ్వ రరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎం. అనిత, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమతో పాటు అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగా సిమెంట్ ఫ్యాక్టరీని స్థాపించుటను రద్దు

రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 21:

అఖిలపక్ష ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల క్రితం కాలుష్యకారక సిమెంట్ ఫ్యాక్టరీ ని రద్దు చేయాలని అఖిలపక్ష ఆధ్వర్యంలో అన్ని పార్టీల వారు మహిళలు విద్యార్థులు ,యువకులు, అన్ని వర్గాల వారు కొట్లాడి ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో వ్యతిరేకించి అంబుజా గో బ్యాక్ అనే నినాదాన్ని గట్టిగా వినిపించి ఫ్యాక్టరీని రద్దు అయ్యే విధంగా చేశామని, దానికి నిన్న అధాని కంపెనీ వారు కలెక్టర్ ఆఫీసులో కలెక్టర్ సమక్షంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేశామని, దానికి బదులుగా డ్రైఫోర్ట్ లాజిస్టిక్ కంపెనీని నెలకొల్పి స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఈ ప్రాంత అభివృద్ధికి కూడా సహాయం చేస్తామని అదాని కంపెనీ ప్రతినిధులు అందరి సమక్షంలో మాటిచ్చారని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ మాట్లాడుతూ అంబుజా ఫ్యాక్టరీని నెల కొల్పకుండా పోరాడి విజయం సాధించినందుకు అఖిలపక్ష నాయకులకు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమ్మవారి కృప కరుణ కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 21:

ఆదివారం 126 – జగద్గిరిగుట్ట డివిజన్ సీసల బస్తిలోని శ్రీ వైష్ణవి దుర్గ దేవాలయంలో జై గురు నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... శ్రీ వైష్ణవి దుర్గా అమ్మవార్ల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, జై గురు నవదుర్గ సేవాసమితి ట్రస్ట్ సభ్యులు శ్రీకాంతాచార్యులు, జైహింద్, రాఘవేందర్, కపిరాజు, రంగనాథ్, కర్ణ, నాయకులు మల్లేష్ గౌడ్, పాపి రెడ్డి, విటల్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, దాసు, రమేష్, ప్రభాకర్, మెట్ల శీను, దాసు, విగ్నేష్, ముంతాజ్, సంతోష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్లలో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో యోగా దినోత్సవ కార్యక్రమం

- ప్రతిరోజు ఉదయాన్నే ప్రతి పౌరుడు వాకింగ్ చేయాలి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి
- ప్రజా సంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్, యోగా గురువు మహమ్మద్ సలాం

మంచాల వెలుతురు జూన్ 21:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల ఆవర ణలో యోగ దినోత్సవ కార్యక్రమంలో యోగా గురువు మహమ్మద్ సలాం ప్రజాసంఘాల అధ్యక్షు లు కంబాలపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం నిర్వహించార ఈ సందర్భంగా ప్రజా సంఘాల అధ్యక్షులు కంబాలపల్లి భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు యోగా చేస్తే ఆరో గ్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తారు ఈ రోజులలో ఆరోగ్యమే మహాభాగ్యం మనిషి కొన్ని ఆ రోగ్య సూత్రాలు పాటించుకుంటూ జీవిత విధానంలో ముందుకు కొన సాగడానికి మంచి జీవితా న్ని అనుభవించడానికి యోగ వ్యాహాయం ఎంతో ఉపయోగం ఉదయం వాక్ చేయడం వాళ్లవ న్నో లాభాలు ఉంటాయి మనం తినే ఆహారము మందులతో పండించిన పంటను తింటున్నాము యోగ వ్యాహం మార్నింగ్ వాక్ ప్రతి ఒక్కమనిషి చేయాలని కోరుతున్నాం ఎండి సలాం సార్ గారి కి యోగా కార్యక్రమంలో పాల్గొన్నందుకు సలహాలు సూచనలు ముందు ముందు తరాలకు ఉప యోగపడే విధంగా సూచనలు ఇవ్వాలని కోరడమైనది ఈకార్యక్రమంలో కంబాలపల్లి శ్రీధర్ కొండగారి ప్రసాద్ మంకు గణేష్. జె నగేష్ శివ రాజుతనీష్ తదితరులు పాల్గొన్నారు.

యోగతో ఆరోగ్యమే మహాభాగ్యం: మహాలక్ష్మి రామన్ గౌడ్

- మల్కోటి పార్కులో యోగా దినోత్సవ వేడుకలు
- వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ శిబిరం
- ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచన
- మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పాల్గొనడం

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హిమాయత్‌నగర్ డివిజన్‌లోని మల్కోటి పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై యోగాభ్యాసంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకుని క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి జీవన నాణ్యత పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్కోటి పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

47 వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 21:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వీకర్ సెక్షన్ కాలనీ, ZPHS స్కూల్ దగ్గర, నిర్వహించిన 47వ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వీకర్ సెక్షన్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు.పేద ప్రజలకు తమ ట్రస్టు ద్వారా వైద్యం అందించాలని ఉద్దేశంతో నిత్యం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈకార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఎ సిఎస్ చైర్మన్ నరేందర్ రాజు, మాజీ ఎంపీటీసీ మల్లేష్, మాజీ కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, భాస్కర్ గౌడ్, బోగారం వెంకటేష్, ఐలేష్ యాదవ్, దప్పు నరేందర్, సాధుయాదవ్, శివారెడ్డి, సొసైటీ బ్యాంక్ వీకర్ సెక్షన్ కాలనీ వాసులు, బికెఆర్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్

- 15వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివా ళులర్పించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ గారు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారు. తెలంగాణ ప్రాంతంపై జరిగిన వివక్షను శాస్త్రీయంగా విశ్లేషించి, తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన జయశంకర్ గారి సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బాల్యమిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 21:

వెల్లంకి గ్రామంలో జినుక అనిత, భర్త శ్రవణ్ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి ఆమె స్నేహితులైన ఎస్ ఎస్ సి 2012–13 బ్యాచ్ రూ.26,000 ఆర్థిక సాయం అందజేసింది. భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్నేహమంటే కేవలం కలిసి చదువుకోవడమే కాదు, ఆపత్కాలంలో ఆపన్న హస్తం అందించడమని చాటిచెప్పారు. ధైర్యంగా ఉండాలని మిత్రులందరి తరపున వెన్ను తట్టారు. కాగా వారిని గ్రామ స్థులు, పలువురు అభినం దించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం

- బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి

రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 21:

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా..

ఈరోజు రామన్నపేట మండలం జూనియర్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం లో బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి యోగా కార్యక్రమంలో యోగా గురువు బొడ్డుపెల్లి సైదులు మరియు బిజెపి నకిరేకల్ ఇన్చార్జి నకిరేకంటి మొగులయ్య రామన్నపేట మండల సర్పంచ్ కే సత్యనారాయణ మాట్లాడుతూ నిత్య జీవితంలో మనమందరము యోగ నీ ఒక భాగంగా ప్రాక్టీస్ చేసుకుంటూ పోతే చాలా రకాల వ్యాధులని నివారించుకోవచ్చు మరియు మానసిక ప్రశాంతతని కూడా పొందవచ్చు. యోగా ద్వారా పిల్లలలో మానసిక వికాసం అధిక ఒత్తిడి నుంచి విముక్తి వస్తుంది.రానున్న రోజులలో పిల్లలకి యోగా ఒక క్రీడగా పోటీలకి పాల్గొనడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఎందరో యోగులు ఋషులు సిద్ధించి సాధించిన ఈ యొక్క యోగ ప్రపంచ మానవాళికి ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య .మండల ఇంచార్జ్ కొరివి శంకర్, మిరియాల మల్లేష్, దావూరి వెంకటేష్, కట్ట యాదయ్య. మండల ప్రధాన కార్యదర్శి మండల ప్రధాన కార్యదర్శి సత్యనా రాయణ మండల ఉపాధ్యక్షులు బట్టే రమేష్ నరసింహ, పొట్టబత్తుల వెంకన్న, గోపగోని అశోక్, ఏనూతుల సురేష్, మేడి పరశురాం, చిన్నపాక స్వామి, వీరమల్ల గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడిగా రావుల భాష, ఉపాధ్యక్షుడిగా చిందం యాదయ్య

ఆరుట్ల కురుమ సంఘం పెద్దలతో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రావుల భాష ఉపాధ్యక్షుడు చిందం యాదయ్య

ఆరుట్ల గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష ఉపాధ్యక్షుడు చిందం యాదయ్య

ఆరుట్ల కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష

- కురుమ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తా
- ఏసమస్య వచ్చినా ముందు ఉండి ఎల్లప్పుడూ అండగా ఉంటాను
- ఆరుట్ల కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష

మంచాల వెలుతురు జూన్ 21:

మంచాల మండలం ఆరుట్ల గ్రామం కురుమ సంఘం పెద్దల సమక్షంలో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రావులభాష ఉపాధ్యక్షుడిగా చిందం యాదయ్య ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష మాట్లాడుతూ నాపై ఉన్న నమ్మకంతో కురుమ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కురుమ సంఘం పెద్దలకు సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కురుమ సంఘానికి ఎల్లప్పుడూ అండగా ఉంటా ఎవ్వరికి ఏసమస్య వచ్చినా సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాను అన్నారు చిన్న చిన్న గొడవలు ఉంటే పోలీస్ స్టేషన్ కు వెళ్లకుండా సంఘం దృష్టికి తీసుకురావాలి సంఘంలోనే పరిష్కారం కురుమ సంఘం పెద్దలం అందరం కలిసి పరిష్కారం కోసం కృషి చేస్తాం అని అన్నారు కురుమ సంఘం సభ్యులందరూ కలిసి మెలిసి ఉం డాలి ఐక్యంగా ఉంటేనే కురుమ సంఘం సభ్యులు ఎలా కలిసి ఉంటారో తెలుస్తుంది అని అన్నా రు అనంతరం కురుమ సంఘం పెద్దలు అందరూ కలిసి నూతనంగా అధ్యక్షుడిగా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రావుల భాష చిందం యాదయ్య లను కురుమ సంఘం సంప్రదాయం ప్రకారం రుమాలు కట్టి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు ఈకార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు మాజీ ప్రజాప్రతి నిధులు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి 12 సంవత్సరాల సుపరిపాలన దేశ అభివృద్ధికి నాంది

- మేధావుల సదస్సులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గారితో కలిసి పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ వెలుతురు జూన్ 21:

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా భారతదేశం అభివృద్ధి, సంక్షేమం, సుశాసనం మరియు ప్రపంచస్థాయి గుర్తింపు దిశగా అపూర్వమైన పురోగతి సాధించిందని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు అన్నారు.శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన మేధావుల సదస్సులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారితో కలిసి పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్" అనే సిద్ధాంతంతో మోదీ గారు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రతి వర్గం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.గత 12 సంవత్సరాలలో పేదలు, రైతులు, మహిళలు, యువత మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేసిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులను తీసుకువచ్చాయని తెలిపారు.ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ప్రధానమంత్రి మోదీ గారు కీలక పాత్ర పోషించారని, నేడు భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన శక్తిగా ఎదుగుతోందని అన్నారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలను సృష్టించి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన చర్యలు చేపట్టి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అదేవిధంగా రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కరీంనగర్ నగర అభివృద్ధి కోసం అర్బన్ చాలెంజ్ ఫండ్ (UCF) కింద రూ.840 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారని, ఇందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో "వికసిత్ భారత్–2047" లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా పయనిస్తోందని, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 12 సంవత్సరాల విజయవంతమైన పాలనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దే వారి సంకల్పానికి ప్రతి భారతీయుడు మద్దతు తెలపాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, భాష సత్యనారాయణ, సుద్దాల దేవయ్య , డాక్టర్ ఆకుల శైలజ , డాక్టర్ రాజ్ కుమార్ ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్

ఇస్నాపూర్ వెలుతురు జూన్ 21:

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.వేడుకలకు హాజరైన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు.

భీమ్ ఆర్మీ ఝరాసంగం మండల కమిటీ సభ్యుల నియామకం

జహీరాబాద్ వెలుతురు జూన్ 21:

భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఝరాసంగం మండల కమిటీ సభ్యుల నియామక కార్యక్రమం జహీరాబాద్‌లోని ఇంద్రప్రస్థ భీమ్ ఆర్మీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన కోసం 'బోధించు – సమీకరించు – పోరాడు' అనే నినాదాలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. వ్యక్తులను కాదు, భావజాలాలను అనుసరించాలని, భావజాలం కలిగిన వ్యక్తులు సమాజాన్ని నిరంతరం చైతన్యవంతం చేస్తారని పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై పోరాడుతూ, డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను గడపగడపకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. రాజ్యాధికార దిశగా ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో భీమ్ ఆర్మీ కమిటీలను ఏర్పాటు చేసి, నీలి జెండాను ప్రతి గడపకు చేర్చాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఝరాసంగం మండల ఇంచార్జి బి. బాబు, కోఆర్డినేటర్ గౌతం కృష్ణ, మహిళా వింగ్ కన్వీనర్ సంజన, కమిటీ సభ్యులు, భీమ్ ఆర్మీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి బహుజన బంధువుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

కరీంనగర్, వెలుతురు జూన్ 21:

ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప కానుక 'యోగ' అని, నిత్యం యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని మాధవ సేవా సమితి అధ్యక్షులు దుర్శెట్టి నిరంజనాచారి, ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కరీంనగర్, కోతి రాంపూర్ లోని గిద్దెపెరుమాండ్ల దేవాలయ మైదానంలో మాధవ సేవా సమితిఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక యోగా శిబిరాన్ని అత్యంత ఉత్సాహంగా , ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాధవ సేవా సమితి అధ్యక్షులు దుర్శెట్టి నిరంజనాచారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి శ్రీనివాస్ పాల్గొనగా, ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ ప్రధాన వక్తగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, "యోగా అనేది కేవలం ఆసనాలకే పరిమితం కాదు, ఇది ఒక సంపూర్ణ జీవన విధానం. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని జయించడానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఏకైక మార్గం" అని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు.యువతకు పిలుపు ప్రధాన వక్త సామల కిరణ్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశ జనాభాలో సుమారు 40 శాతం మంది యువత ఉన్నారు. ఈ యువశక్తే దేశ భవిష్యత్తుకు వెన్నెముక. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, యోగా ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి. దేశాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించి, సమాజ హితానికి పాటుపడాలి" అని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు, యోగా ఆసక్తిపరులు, మాధవ సేవా సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, వివిధ ఆసనాలను నిపుణుల పర్యవేక్షణలో అభ్యాసం చేశారు.ఉత్సాహపూరిత వాతావరణం ఉదయం వేళ మైదానమంతా యోగా సాధనతో ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది.స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి, యోగా ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాధవ సేవా సమితి ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

కోర్టు ఆవరణలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

జహీరాబాద్ వెలుతురు జూన్ 21:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితాదేవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొని యోగాసనాలు చేశారు.ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ యోగా ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. నిత్య జీవితంలో యోగా అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంత జీవనం గడపవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగా కోసం కేటాయించాలని సూచించారు.కార్యక్రమంలో ఏజీపీ దత్తాత్రేయ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు గోపాల్, మానెన్న, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

- మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై. నరోత్తం

జహీరాబాద్ వెలుతురు జూన్ 21:



తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన మహనీయుడు ప్రొఫెసర్ కోతపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై. నరోత్తం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వై. నరోత్తం మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మేధావి ప్రొఫెసర్ జయశంకర్ అని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనే తన జీవిత లక్ష్యంగా భావించి చివరి శ్వాస వరకు ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించారని కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, త్యాగం, అంకితభావం తెలంగాణ సమాజానికి చిరస్థాయిగా స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. నేటి తరాలు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రజలు ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను ఎప్పటికీ మరువలేరని వై. నరోత్తం పేర్కొన్నారు.ఈ నివాళి కార్యక్రమంలో గోపాల్, నర్సింలు, జగన్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు తమ నివాళులు అర్పించారు.

బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అంతరాతీయ యోగా దినోత్సవం

- యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం
- బిజెపి నేతలు ఇనుగోండ నాగేశ్వర్ రెడ్డి చింతం శ్రీనివాస్

తిమ్మాపూర్ వెలుతురు జూన్ 21:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున యోగా వేడుకలను నుస్తులాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో, శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అత్యంత ఉత్సాహంగా , ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగోండనాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ లుమాట్లాడుతూ"ప్రస్తుత యాంత్రిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయనీ, క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా అనేది కేవలం ఒక రోజుకు పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ నిత్యజీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రపంచ వ్యాప్తంగా భారతీయ సంస్కృతి, యోగా గొప్పతనాన్ని చాటి చెప్పడంలో ప్రధాని నరేంద్ర మోదీ విశేష కృషి చేస్తున్నారని, ఆయన చొరవ వల్లే నేడు ప్రపంచమంతా యోగా దినోత్సవాన్ని జరుపుకుంటోందని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులుబూట్ల శ్రీనివాస్,ఓ బీ సి మండల అధ్యక్షుడు దుర్శేటి రమేష్,కోయ్యడ శ్రీనివాసు,దొనపాటి ప్రదీప్ రెడ్డి, తమ్మనవేని రాజుయదవ్,జంగ సునిల్ రెడ్డి, కల్వ శ్రీనివాస్,ఏర్రోజు లక్ష్మణ చారి, బొబ్బల రమణారెడ్డి, యోగ మాస్టర్ మరలి చారి,బొడ్డు అశోక్,బొడ్డు శ్రీనివాస్,గోలి మదుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం ఈశ్వరయ్య పార్థివ దేహానికి నివాళులర్పించిన హరీష్‌రావు, మాణిక్‌రావు, చింత ప్రభాకర్

జహీరాబాద్ వెలుతురు జూన్ 21:

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మల్కాపురం శివకుమార్ తండ్రి, మాజీ సర్పంచ్ మల్కాపురం ఈశ్వరయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈశ్వరయ్య గ్రామాభివృద్ధికి, ప్రజాసేవకు చేసిన సేవలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నాయకుడు నామ రవికిరణ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, పట్టణ కౌన్సిలర్లు అబ్దుల్లా, యాకూబ్, గౌస్ గౌరీ, జాకీర్, మహిపాల్, దీపక్, ప్రవీణ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

జహీరాబాద్ వెలుతురు జూన్ 21:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి యోగాసనాలు నిర్వహించి యోగా ప్రాముఖ్యతను చాటి చెప్పారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సంపూర్ణ జీవన విధానమని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు.ఇటీవల ప్రారంభమైన త్రివేణివనం–ఫారెస్ట్ ఎకో పార్క్‌ను జహీరాబాద్ ప్రజలు సందర్శించి అందులో కల్పించిన యోగా, వాకింగ్, సైక్లింగ్ తదితర సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, డీఎస్పీ సైదా నాయక్, సీఐ శివలింగం, ఎస్సై లవ కుమార్, శంకర్ పటేల్, ఆదర్శ విద్యాలయ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ మరియు పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరి జిల్లాలో ఎన్‌సీబీ మెరుపు దాడి

- ఐదున్నర కోట్ల గంజాయి డంప్ సీజ్
- ఫోన్ ట్రాకింగ్‌తో ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్
- దట్టమైన కొండ మార్గాల్లో బొలెరో వాహనంతో ప్రయాణం
- ఫోన్ ట్రాకింగ్ టెక్నాలజీతో స్మగ్లర్ల గుట్టు రట్టు
- కూటమి ప్రభుత్వ 'ఈగల్ టీమ్స్' ఉక్కుపాదం

మన్యం వెలుతురు జూన్ 21:

అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పోలీసులు భారీ సీక్రెట్ ఆపరేషన్ చేపట్టారు. ఒడిశా సరిహద్దుల గుండా ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించిన ఒక భారీ గంజాయి రవాణా ముఠాను అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు గ్రామం సమీపంలో ఈ మెరుపుదాడి జరిగింది. ఈ ఆపరేషన్‌లో దాదాపు 1,125 కిలోల నాణ్యమైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ మొత్తం సరకు విలువ అంతర్జాతీయ నల్లబజారు మార్కెట్లో సుమారు రూ. 5 కోట్ల 62 లక్షల వరకు ఉంటుందని ఎన్‌సీబీ ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో (ఏఓబీ) నిరంతరం సాగుతున్న నిఘా మరియు తనిఖీల నుంచి తప్పించుకునేందుకు గంజాయి స్మగ్లర్లు ఈసారి ఒక సరికొత్త రవాణా మార్గాన్ని ఎంచుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా పరిధిలో ఉన్న 'జనతా పై' అనే మారుమూల గ్రామం నుంచి ఈ భారీ గంజాయి లోడ్ బయలుదేరింది. అక్కడి నుంచి ఎవరికీ అనుమానం రాకుండా ఆంధ్రా సరిహద్దుల్లోని ముంచంగిపుట్టు ఏజెన్సీ మీదుగా కొండ దారుల గుండా ప్రయాణించారు. ఈ ఏపీ బోర్డర్ గ్రామాలను దాటుకుని, తిరిగి ఒడిశాలోని జైపూర్ పట్టణానికి ఈ సరకును సురక్షితంగా చేర్చాలనేది స్మగ్లర్ల ప్రధాన ప్లాన్.మన్యంలోని దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, ఘాట్ రోడ్లను ఆసరాగా చేసుకుని స్మగ్లర్లు తమ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. సాధారణంగా రాత్రి సమయాల్లో పోలీసుల సంచారం తక్కువగా ఉంటుందనే అంచనాతో ఒక మహీంద్రా బొలెరో పికప్ వాహనంలో గంజాయి బస్తాలను లోడ్ చేశారు. పైకి చూడటానికి ఏదో నిత్యావసర సరుకులు లేదా కూరగాయల లోడ్ లాగా కనిపించేలా పైన గట్టిగా తార్పాలిన్ కప్పారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా అత్యంత వేగంగా కొండ మార్గాల గుండా వాహనాన్ని పోనిచ్చారు.స్మగ్లర్లు ఎంత పకడ్బందీగా, గుట్టుచప్పుడు కాకుండా ప్లాన్ గీసినప్పటికీ ఎన్‌సీబీ నిఘా నేత్రం ముందు వారి ఆటలు సాగలేదు. విశాఖపట్నం, అల్లూరి జిల్లాల పరిధిలో గంజాయి కదలికలపై నిరంతరం నిఘా పెట్టే ఎన్‌సీబీ విశాఖ డివిజన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌కు ఈ రవాణాపై ముందస్తుగా నమ్మకమైన సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం ఆధునిక టెక్నాలజీని వాడుకుంది. నిందితుల ఫోన్ నంబర్లను ఎప్పటికప్పుడు లొకేషన్

ట్రాకింగ్ (కాల్ డేటా మానిటరింగ్) చేయడం ద్వారా వారు కచ్చితంగా ఏ మార్గంలో వస్తున్నారో కనిపెట్టారు. స్మగ్లర్లు బూసిపుట్టు మలుపు వద్దకు రాగానే పోలీసులు ఒక్కసారిగా చుట్టుముట్టారు.పోలీసులు జరిపిన ఈ ఆకస్మిక దాడిలో బొలెరో వాహనంలో కూర్చుని ఉన్న ముగ్గురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను ఎన్‌సీబీ బృందం అక్కడికక్కడే అదుపులోకి తీసుకుంది. పట్టుబడిన వారిని విచారించగా, వారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కాగా, మరొకరు ఒడిశా నివాసిగా తేలింది. ఏపీకి చెందిన గోపాలు, అనంతరామ అనే నిందితులతో పాటు, ఒడిశాకు చెందిన కరణ్ అనే స్మగ్లర్‌ను పోలీసులు అధికారికంగా అరెస్టు చేశారు. అనంతరం వాహనంలోని గంజాయి ప్యాకెట్లను కిందకు దించి తూకం వేయగా.. మొత్తం 1,125 కిలోల బరువు తేలింది.ప్రస్తుతం బయటి రాష్ట్రాల్లో గంజాయికి ఉన్న విపరీతమైన డిమాండ్‌ను బట్టి రేట్లను లెక్కించారు. మార్కెట్లో ఒక కిలో నాణ్యమైన ఏజెన్సీ గంజాయి విలువ సుమారు రూ. 50 వేల వరకు పలుకుతుందని అధికారులు అంచనా వేశారు. ఆ లెక్కన చూసుకుంటే పట్టుబడిన ఈ 1,125 కిలోల భారీ సరకు విలువ సుమారు రూ. 5 కోట్ల 62 లక్షలకు పైనే ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. ఇంత భారీ మొత్తంలో సరకు పట్టుబడటం ఏజెన్సీ హిస్టరీలోనే ఒక పెద్ద విజయంగా ఎన్‌సీబీ వర్గాలు భావిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి సంస్కృతిని పూర్తిగా తుడిచిపెట్టాలని డిసైడ్ అయింది. ఇందులో భాగంగానే విశాఖ, అల్లూరి జిల్లాల ఏజెన్సీ పరిధిలో గంజాయి తోటలను ధ్వంసం చేసేందుకు 'ఈగల్ టీమ్స్' అనే ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించింది. ఈ టీమ్స్ మన్యంలోని మారుమూల కొండలపై డ్రోన్ల సహాయంతో గంజాయి సాగును కంప్లీట్‌గా రూపుమాపాయి. ఏపీలో సాగు పూర్తిగా తగ్గిపోవడంతో, స్థానికంగా సరకు దొరకడం స్మగ్లర్లకు గగనమైపోయింది.ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు గట్టి నిఘా పెట్టడంతో స్మగ్లర్లు ఇప్పుడు పక్క రాష్ట్రమైన ఒడిశా వైపు తమ దృష్టిని మళ్లించారు. ఒడిశాలోని అంతర్గత ప్రాంతాల్లో పండించే గంజాయిని దొంగచాటుగా ఏపీ బోర్డర్ల మీదుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అంతేకాకుండా, పోలీసుల తనిఖీల్లో దొరకకుండా ఉండేందుకు స్మగ్లర్లు రోజురోజుకూ అడ్వాన్స్ టెక్నాలజీని వాడుతున్నారు. గతంలో కేవలం ఎండిన ఆకులు, పొడి రూపంలో గంజాయిని తరలించేవారు. కానీ ఇప్పుడు మరింత తెలివిగా గంజాయిని ప్రాసెస్ చేసి 'లిక్విడ్ గంజాయి' (ద్రవరూపం) గా మార్చి సీసాల్లో గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు.ప్రస్తుతం పట్టుబడిన ముగ్గురు నిందితులను ఎన్‌సీబీ అధికారులు తమ స్టైల్లో విచారించగా, ఈ సరకును ఒడిశాలోని జైపూర్ పట్టణంలో ఉన్న ఒక పెద్ద గంజాయి మాఫియా డీలర్‌కు అప్పగించేందుకు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో జైపూర్‌లో ఉన్న సదరు ప్రధాన కొనుగోలుదారులు మరియు ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు ఎన్‌సీబీ ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దించింది. ఒడిశా పోలీసుల సహాయంతో అంతర్రాష్ట్ర ముఠాల ఆటకట్టించే వరకు ఈ స్పెషల్ డ్రైవ్స్ మరియు దాడులు ఏజెన్సీలో నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

ప్రతి పోలీసు అధికారి యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి - సైబరాబాద్ సీపీ

- 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సైబరాబాద్ పోలీసులు
- "యోగ ఫర్ వెల్‌నెస్, రెడీనెస్ & రెసిలియన్స్" థీమ్‌తో నిర్వహణ

సైబరాబాద్ వెలుతురు జూన్ 21:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈరోజు సైబరాబాద్ సీపీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "Yoga for Wellness, Readiness & Resilience" అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు సుమారు 250 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని యోగా సాధన చేశారు.అనంతరం సీపీతో పాటు అధికారులు, సిబ్బంది యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ యోగా అనేది భారతీయ నాగరికత ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని

తెలిపారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలు సమర్థవంతంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.పోలీసు విధుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అత్యంత ముఖ్యమని సీపీ తెలిపారు. "A Calm Mind, A Strong Body, A Safer Society" అనే సందేశంతో ప్రతి పోలీసు అధికారి ఆరోగ్యవంతమైన శరీరం, ఏకాగ్రత కలిగిన మనస్సును పెంపొందించుకోవాలని సూచించారు. యోగా ద్వారా మానసిక బలం పెరిగి, ప్రశాంతమైన మనస్సుతో స్పష్టమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగు

తుందని పేర్కొన్నారు.శ్వాసపై ధ్యాస కేంద్రీకరించడం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారి, ఒత్తిడిని అధిగమించే శక్తి లభిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగా, ప్రాణాయామం, ధ్యానం (మెడిటేషన్) కోసం కేటాయించాలని సూచించారు.పోలీస్ విధులు అధిక ఒత్తిడితో కూడుకున్నవని, అందువల్ల ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని సీపీ సూచించారు. "Fearless Service – Fit Force, Focused Mind" అనే లక్ష్యంతో శారీరక దృఢత్వం, భావోద్వేగ సమతుల్యత, వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఆరోగ్యవంతమైన పోలీసు వ్యవస్థ ద్వారానే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని, "Better Health – Better Policing" అనే సందేశాన్ని అందించారు.

సైబరాబాద్‌లో వీకెండ్- స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..279 మందిపై కేసులు

సైబరాబాద్ వెలుతురు జూన్ 21:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 279 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.228 ద్విచక్ర వాహనదారులు,08 ఆటోలు,43 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —230 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,– 33 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, – 16 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్

టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ఠ శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (15.06.2026 – 20.06.2026) లో 622 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.00 మందికి జరిమానా, జైలు శిక్ష, 01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,621 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల ఓటు హక్కుల పరిరక్షణపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చ

హుస్నాబాద్ వెలుతురు జూన్ 21:

సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో చర్చ జరిగింది.తెలంగాణ రాష్ట్ర 'గల్ఫ్ కాంగ్రెస్' ప్రతినిధి సుతారి సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి ఆదివారం రోజున హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్న తెలంగాణకు చెందిన గల్ఫ్ కార్మికులు, ఎన్నారైలు తమ ఓటరు నమోదును కొనసాగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆన్‌లైన్ జూమ్ సమావేశాలు, సోషల్



మీడియా వేదికల ద్వారా ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.వారి ప్రతిపాదనలను మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్వీకరించినట్లు తెలిపారు. అలాగే తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు, గల్ఫ్ కార్మికులతో ప్రత్యక్షంగా మమేకమయ్యేందుకు గల్ఫ్ దేశాలను పర్యటించాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ వాసుల పాత్ర ఎంతో కీలకమని, వారి సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

అంగన్వాడి కేంద్రాల్లో ఇమంది గణేష్ జన్మదిన వేడుకలు

- కేంద్రాల్లో కుర్చీలు పంపిణీ చేసిన గణేష్
- పాల్గొన్న 55వ డివిజన్ ప్రజలు.
- భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్

కొత్తగూడెం వెలుతురు జూన్ 21:

55వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఇమంది గణేష్ జన్మదిన వేడుకలు 55వ డివిజన్లోని అంగన్వాడి సెంటర్లలో జరుపుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్లో ఐదు అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు ఫైబర్ కుర్చీలను పంపిణీ చేశారు. అనంతరం చాక్లెట్లు అందించి వారితో గడిపారు. ఈ సందర్భంగా ఇమంది గణేష్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో ఏదైనా సమస్యలు ఉంటే తమకు తెలపాలని పరిష్కరించే దిశగా అధికారులతో

మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్లోని కసింకోట అప్పారావు ఇమంది రామారావు, కుసుమ మురళి, ఇమంది హరికృష్ణ, మాడెం వసుధ వేణుగోపాల్ రావు, ఇమంది ఉదయ్ కుమార్, గౌతమ్,

హర్ష, భాను, సమీర్ మరియు అంగన్వాడి సెంటర్లకు సంబంధించిన టీచర్లు పద్మ, రాధ, ప్రసన్నలక్ష్మి , రజిని, సుజాత, మాడెం బేబీ శాన్వి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో ఉచిత మెడికల్ క్యాంపు సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతం

కొండాపురం వెలుతురు జూన్ 21:

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపురం గ్రామంలో సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎస్వీఎస్ మెడికల్ కాలేజ్ యాజమాన్యం సహకారం అందించింది. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 20 మంది అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని పంపించారు. ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, పీడియాట్రిక్, గైనకాలజీ, ఆప్టాల్మాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించారు.మెడికల్ క్యాంపును సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన 28

మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.క్యాంపులో పాల్గొన్న వైద్యులను సర్పంచ్, గ్రామ పెద్దలు, ఆశా వర్కర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం వైద్య బృందానికి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు చూపిన ఆతిథ్యం, సర్పంచ్ సేవా తత్వాన్ని వైద్యులు అభినందించారు.ఈ మెడికల్ క్యాంపు ద్వారా గ్రామ ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన పొందారని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు జమన్న, నాగరాజు, పద్మారెడ్డి, మల్లేష్, ఐజ్జ వీరేష్, ఎస్. తిమ్మారెడ్డి, ప్రభాకర్, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు చమురు భాగ్యం హర్మ్యూజ్ జలసంధి దాటిన భారత నౌకలు

- సురక్షితంగా వస్తున్న 3 భారీ ట్యాంకర్లు
- దేశ ఇంధన భద్రతకు దౌత్యపరమైన ఊరట
- 94 మంది భారతీయ సిబ్బందితో సురక్షిత ప్రయాణం
- జూన్ 24 నుండి జూలై 1 మధ్య భారత తీరానికి నౌకలు
- గుజరాత్ రేవులకు చేరనున్న 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్'
- అంతర్జాతీయ దౌత్య విజయం.. దేశ ఇంధన భద్రతకు భరోసా

పశ్చిమాసియా వెలుతురు జూన్ 21:

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల నడుమ భారతదేశానికి అంతర్జాతీయంగా ఒక భారీ ఊరట లభించింది. ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మ్యూజ్ జలసంధి' పై ఆంక్షలు సడలడంతో.. మూడు భారీ భారతీయ ముడిచమురు ట్యాంకర్లు సురక్షితంగా ఆ జలమార్గాన్ని దాటాయి. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ఫలితంగా ఈ సముద్ర మార్గంలో నౌకల రాకపోకలపై ఉన్న అడ్డంకులు తొలిగాయి. భారత జెండాతో ఉన్న ఈ మూడు భారీ నౌకలు ఏకంగా 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ప్రస్తుతం మన దేశ ఓడరేవుల వైపు వేగంగా ప్రయాణిస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా దేశ ప్రజలతో పంచుకున్నారు.

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గత కొన్ని నెలలుగా హర్మ్యూజ్ జలసంధి గుండా నౌకల ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. అయితే, తాజాగా అంతర్జాతీయ దౌత్య చర్చల తర్వాత అక్కడ ఆంక్షలు సడలించడం భారతదేశానికి పెద్ద ప్లస్ పాయింట్ (అసెట్) గా మారింది. దేశీయంగా నిరంతరం పెరుగుతున్న ఇంధన అవసరాల కోసం ముడిచమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడే భారత్‌కు, ఈ సముద్ర మార్గం తిరిగి తెరుచుకోవడం వల్ల ఇంధన భద్రతతో పాటు అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి ఎనలేని బలం చేకూరినట్లయింది.హర్మ్యూజ్ జలసంధిని అత్యంత విజయవంతంగా, సురక్షితంగా దాటిన ఆ మూడు చమురు నౌకల పేర్లు 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్'. ఈ భారీ ట్యాంకర్లలో మొత్తం 94 మంది భారతీయ నౌక సిబ్బంది (నావికులు) విధులు నిర్వహిస్తున్నారు. యుద్ధ వాతావరణం ఉన్న ప్రాంతం నుండి మన నావికులు, నౌకలు ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడటంపై కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశ సముద్ర ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన కొనియాడారు.సముద్రంలో ప్రయాణిస్తున్న ఈ మూడు భారీ చమురు నౌకలు జూన్ 24వ తేదీ నుండి జూలై 1వ తేదీల మధ్య వేర్వేరు రోజుల్లో భారత తీరానికి చేరుకోనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. లక్షలాది టన్నుల ఇంధనంతో వస్తున్న ఈ నౌకల రాక కోసం భారత ఓడరేవుల యంత్రాంగం ఇప్పటికే అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను సిద్ధం చేసింది. ఈ నౌకలు గమ్యస్థానాలకు చేరితే దేశంలో చమురు నిల్వలు మరింత పటిష్టం కానున్నాయి.కేంద్ర మంత్రిత్వ శాఖ అందించిన షెడ్యూల్ ప్రకారం.. 'దేశ్ వైభవ్' నౌక జూన్ 24న గుజరాత్‌లోని ప్రసిద్ధ 'వాడినార్' ఓడరేవుకు చేరుకోనుంది. అలాగే, అదే రోజున (జూన్ 24) 'దేశ్ విభోర్' అనే మరో భారీ ట్యాంకర్ కూడా గుజరాత్‌లోని 'సిక్కా' ఓడరేవుకు సురక్షితంగా రానుంది. ఈ రెండు నౌకల ద్వారా వచ్చే చమురును స్థానిక రిఫైనరీలకు తరలించి శుద్ధి చేయనున్నారు.మరోవైపు, జూన్ 20వ తేదీన హర్మ్యూజ్ జలసంధిని విజయవంతంగా దాటిన మూడవ నౌక 'సన్మార్ హెరాల్డ్' తూర్పు తీరం వైపు ప్రయాణిస్తోంది. ఈ నౌక జూలై 1వ తేదీన ఒడిశా రాష్ట్రంలోని ప్రముఖ 'పారాదీప్' ఓడరేవుకు చేరుకోనుందని అధికారిక సమాచారం అందింది. దేశంలోని వేర్వేరు దిశల్లో ఉన్న ఓడరేవులకు ఈ చమురు సరఫరా కావడం వల్ల దేశవ్యాప్తంగా ఇంధన పంపిణీ సులువవుతుంది.భారత్‌కు ఈ ముడిచమురు నౌకలు సురక్షితంగా రావడం వెనుక అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఒక పెద్ద దౌత్యపరమైన మలుపు ఉంది. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలను తొలగించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఇటీవల ఒక కీలక ఒప్పందం కుదిరింది. జూన్ 18న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ చారిత్రాత్మక శాంతి ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. దీంతో అంతర్జాతీయంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.ఈ అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం.. ఇరాన్ దేశం తన వద్ద ఉన్న అత్యధికంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అంతర్జాతీయ నిబంధనల మేరకు తగ్గించుకోవడానికి అంగీకరించింది. దీనికి ప్రతిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై ఉన్న కొన్ని కఠినమైన ఆర్థిక, నౌకాదళ ఆంక్షలను సడలిస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ సంతకం చేసిన వెంటనే, అదే రోజున హర్మ్యూజ్ జలసంధి గుండా అంతర్జాతీయ నౌకల రాకపోకలపై ఉన్న నిషేధాన్ని అమెరికా ఎత్తివేసింది.నెలల తరబడి మూతపడి స్తంభించిపోయిన హర్మ్యూజ్ జలమార్గం ఒక్కసారిగా తెరుచుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా పునఃప్రారంభమైంది. మన దేశ ఇంధన అవసరాల మార్గాలు నిరంతరాయంగా సాగడం భారత్‌కు ఎంతో కీలకం. ఈ మూడు భారతీయ నౌకలు సురక్షితంగా మన దేశానికి రావడం అనేది ఒకవైపు అంతర్జాతీయ దౌత్యం సాధించిన విజయాన్ని చూపిస్తుండగా.. మరోవైపు భారత ప్రభుత్వం తన దేశ ఇంధన భద్రతకు, అంతర్జాతీయ సముద్ర ప్రయోజనాలకు ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందని ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సైబర్ బాధితులకు ఊరట

- రూ.45.21 కోట్ల నగదు వాపస్..
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- వేగంగా స్పందించి 6,303 బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్
- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ.4.04 కోట్ల రిఫండ్
- సైబరాబాద్, రాచకొండ పరిధిలోనూ భారీగా రికవరీలు
- పోర్టల్ ద్వారా రూ.445 కోట్ల నిధుల నిలుపుదల
- మోసపోతే వెంటనే '1930' హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

ఆన్‌లైన్ కేటుగాళ్ల బారిన పడి విలవిలలాడుతున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పెద్ద ఊరటనిచ్చింది. రాష్ట్రంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు ఇప్పటి వరకు రూ.45.21 కోట్ల రూపాయలను విజయవంతంగా రిఫండ్ చేసినట్లు బ్యూరో ఆదివారం ఒక ప్రక్రియలో వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 20వ తేదీ వరకు బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, తక్షణ చర్యల ఆధారంగానే ఈ భారీ మొత్తాన్ని రికవరీ చేసి వారి ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు వివరించారు. టెక్నాలజీ సాయంతో నేరగాళ్ల అకౌంట్లను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ నిధులు చేజారకుండా చూస్తున్నామని స్పష్టం చేశారు.సైబర్ దగాకు గురైన బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయడంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తక్షణమే స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరగాళ్లు వాడిన సుమారు 6,303 బ్యాంక్ ఖాతాలను గుర్తించి, వాటిని తక్షణమే ఫ్రీజ్ (స్తంభింపజేయడం) చేశారు. అలా ఫ్రీజ్ చేసిన బ్యాంక్ అకౌంట్లలో ఉన్న నిధుల మొత్తం విలువే రూ.45.21 కోట్లు అని అధికారులు స్పష్టం చేశారు. బాధితులు ఎంత త్వరగా స్పందిస్తే అంత వేగంగా నిందితుల అకౌంట్లను బ్లాక్ చేసి డబ్బులు కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్‌ను నిర్మూలించేందుకు టీజీసీఎస్‌బీ అహర్నిశలు శ్రమిస్తోంది. కేవలం బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడమే కాకుండా, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసేందుకు కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే అత్యంత క్లిష్టమైన 77 కేసులలో లోతైన విచారణ జరిపి, నేరగాళ్ల నుంచి రూ.6.83 కోట్ల రూపాయలను నేరుగా రికవరీ చేయడంలో బ్యూరో అధికారులు కీలక పురోగతి సాధించారు.రాష్ట్ర రాజధానిలోని మూడు ప్రధాన కమిషనరేట్ల పరిధిలో సైబర్ క్రైమ్స్ ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో పోలీసులు నిఘా తీవ్రం చేశారు. అందులోనూ ముఖ్యంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బాధితులు కోల్పోయిన సొమ్ముపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ పరిధిలో మొత్తం 779 కేసులకు సంబంధించి పక్కా ఆధారాలు సేకరించి, బాధితుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.4.04 కోట్ల నగదును తిరిగి రిఫండ్ చేయించగలిగారు.ఐటీ హబ్‌గా ఉన్న సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల పేరిట జరుగుతున్న మోసాలపై పోలీసులు గట్టిగా ఫోకస్ పెట్టారు. సైబరాబాద్ పరిధిలోని 755 కేసుల్లో దర్యాప్తు జరిపి రూ.3.22 కోట్లను రికవరీ చేసి వాపస్ ఇచ్చారు. అదేవిధంగా, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 167 కేసులను ఛేదించి బాధితులకు రూ.1.69 కోట్ల రూపాయలను రిఫండ్ ఇప్పించారు. నగరవ్యాప్తంగా సాగుతున్న ఈ రికవరీలు సైబర్ బాధితుల్లో కొత్త నమ్మకాన్ని నింపుతున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన 'తెలంగాణ సైబర్ నేర నెట్‌వర్క్ పోర్టల్' ద్వారా పోలీసులు నిరంతరం ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా ఉంచారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో నమోదైన మొత్తం 59,953 కేసులలో తక్షణమే చర్యలు తీసుకున్నారు. సైబర్ దొంగలు ఆయా సొమ్మును వేరే అకౌంట్లలోకి మార్చకుండా లేదా విత్‌డ్రా చేసుకోకుండా పోర్టల్ ద్వారా అలర్ట్ పంపి ఏకంగా రూ.445.41 కోట్ల రూపాయలను బ్యాంకుల్లోనే ఫ్రీజ్ చేయించి నిలిపివేశారు.సైబర్ నేరగాళ్లు ప్రతిరోజూ సరికొత్త పద్ధతులతో అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. మొబైల్ ఫోన్లకు వచ్చే అపరిచిత లింకులను ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించింది. బ్యాంకు అధికారుల పేరిట లేదా లాటరీల పేరిట వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి మీ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు స్పష్టం చేసింది.ఒకవేళ ఎవరైనా దురదృష్టవశాత్తూ సైబర్ మోసానికి గురై డబ్బులు కోల్పోతే.. ఏమాత్రం సమయం వృథా చేయకుండా తక్షణమే స్పందించాలని అధికారులు కోరారు. మొదటి గంట (గోల్డెన్ అవర్) లోపే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన '1930' జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లేదా కేంద్ర హోంశాఖకు చెందిన అధికారిక నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేస్తే వెంటనే నిధులు ఫ్రీజ్ అవుతాయని బాధితులకు సూచించారు.రాష్ట్రంలో ఏటా సైబర్ నేరాలు పెరుగుతున్నప్పటికీ, వాటిని అడ్డుకునేందుకు పోలీస్ యంత్రాంగం కూడా అంతే

బలంగా సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటోంది. గడిచిన కొన్నేళ్లుగా ఫ్రీజ్ చేసిన నిధుల వివరాలను బ్యూరో అధికారికంగా విడుదల చేసింది. 2023 సంవత్సరంలో రూ.8.36 కోట్లు ఫ్రీజ్ చేయగా.. 2024 లో అది రూ.183.9 కోట్లకు చేరింది. అలాగే 2025 లో రూ.182.9 కోట్లను హోల్డ్ చేయగా.. ప్రస్తుత ఏడాది 2026 లో కేవలం జూన్ 20వ తేదీ నాటికే రికార్డు స్థాయిలో రూ.70.07 కోట్ల నిధులను ఫ్రీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

రూ.95 లక్షల ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం కేసు ఛేదన

- 7 మంది నిందితుల అరెస్ట్
- రూ.26.57 లక్షల నగదు స్వాధీనం

సైబరాబాద్ వెలుతురు జూన్ 21:

సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ వారు క్రైమ్ నెం.1053/2026లో నమోదు చేసిన ఆన్‌లైన్ ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ మోసం కేసును విజయవంతంగా ఛేదించి, ఈ కేసులో ప్రమేయం ఉన్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దర్యాప్తు సందర్భంగా మోసపూరిత సొమ్ము తరలింపులో ఉపయోగించిన మ్యూల్ బ్యాంక్ ఖాతాలను గుర్తించి, గణనీయమైన మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు నగదు, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

కేసు వివరాలు

బాధితుడు శ్రీ శ్రీకాంత్ రెడ్డి @ సురేష్ రెడ్డిని "Elera Capital Desk" పేరుతో నిర్వహిస్తున్న నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో పెట్టుబడులు పెట్టేలా నిందితులు ప్రలోభపెట్టారు. వాట్సాప్ గ్రూపులు మరియు ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడులు పెట్టించారు.బాధితుడు తొలుత రూ.46 లక్షలు పెట్టుబడి పెట్టగా, ట్రేడింగ్ ఖాతాలో రూ.2,04,54,000/- లాభం వచ్చినట్లు నకిలీగా చూపించారు. ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు (Withdraw) ప్రయత్నించినప్పుడు ట్యాక్స్, సెక్యూరిటీ డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజు మరియు ఇతర చార్జీల పేర్లతో మరింత డబ్బు చెల్లించాలని నిందితులు కోరారు. ఈ విధంగా వివిధ ట్యాక్సులు మరియు ఛార్జీల పేరుతో మరో రూ.49 లక్షలు వసూలు చేసి, మొత్తంగా బాధితుడి నుండి రూ.95 లక్షలు కాజేశారు.డబ్బు ఉపసంహరణ జరగకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

దర్యాప్తు

సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంకింగ్ లావాదేవీలు మరియు మనీ ట్రైల్‌ను విశ్లేషించి మోసపూరిత సొమ్ము ప్రవాహాన్ని గుర్తించారు. దర్యాప్తులో నేరగాళ్లు మోసపూరిత సొమ్మును 45 లేయర్ బ్యాంక్ ఖాతాల ద్వారా తరలించినట్లు వెలుగులోకి వచ్చింది.ప్రత్యేక పోలీసు బృందాలు విశాఖపట్నంలోని గాజువాక ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించి ఈ కేసులో

ప్రమేయం ఉన్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశాయి.

అరెస్టయిన నిందితులు

1. రపర్తి గౌతమ్ (A8) – అకౌంట్ సప్లయర్ కమ్ క్యాష్ సప్లయర్
2. సేనాపతి పెంటయ్య (A9) – క్యాష్ రిసీవర్
3. బొడాల సాయి కుమార్ (A10) – అకౌంట్ సప్లయర్
4. మురపాకల కుమార్ (A11) – అకౌంట్ సప్లయర్
5. విజ్జిపు సత్యనారాయణ (A13) – అకౌంట్ హోల్డర్
6. మంత్రి సాయి కుమార్ (A14) – క్యాష్ సప్లయర్
7. ఊట నారాయణ (A15) – అకౌంట్ హోల్డర్

నిందితుల పాత్ర

దర్యాప్తులో బొడాల సాయి కుమార్ (A10) మోసపూరిత సొమ్మును నగదు రూపంలో సేకరించి రపర్తి గౌతమ్ (A8)కు అందజేసినట్లు, అనంతరం రపర్తి గౌతమ్ ఆ నగదును సేనాపతి పెంటయ్య (A9)కు అందించినట్లు తేలింది. మంత్రి సాయి కుమార్ (A14) నగదు రవాణా మరియు పంపిణీలో కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఇతర నిందితులు మ్యూల్ బ్యాంక్ ఖాతాలను సమకూర్చడం, ఖాతాదారులను ఏర్పాటు చేయడం మరియు మనీ లాండరింగ్ కార్యకలాపాలకు సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

రికవరీ మరియు బాధితునికి ఉపశమనం

దర్యాప్తు సందర్భంగా:

రూ.26,57,500/- నగదు స్వాధీనం చేసుకున్నారు.

రూ.12 లక్షల విలువైన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు.

కోర్టు ద్వారా రూ.9 లక్షల రీఫండ్ ఆర్డర్లు పొందారు.

నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు మరియు ఇతర డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తు బృందం పనితీరు

ఈ కేసు ఛేదనలో ఇన్‌స్పెక్టర్ మధు అత్యంత కీలక పాత్ర పోషించారు. డిజిటల్ ఆధారాలను సేకరించడం, మనీ ట్రైల్‌ను శాస్త్రీయంగా విశ్లేషించడం, నిధుల ప్రవాహాన్ని స్థాపించడం మరియు నిందితుల పాత్రను నిర్ధారించడంలో ఆయన విశేష కృషి చేశారు.అలాగే ఎస్ఐ శ్రీనివాస్ మరియు వారి బృందం ఆపరేషన్ సమయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితుల అరెస్టు, నగదు రికవరీ మరియు ఇతర ఆధారాల స్వాధీనంలో సమర్థవంతంగా పనిచేశారు.ఈ కేసును పర్యవేక్షించిన ఏసీపీ శ్రీ రవీందర్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో దర్యాప్తు విజయవంతంగా పూర్తయింది. కేసు ఛేదనలో విశేష కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్ఐ శ్రీనివాస్ మరియు వారి బృందాన్ని, అలాగే కేసును సమర్థవంతంగా పర్యవేక్షించిన ఏసీపీ రవీందర్ రెడ్డిని డీసీపీ సైబర్ క్రైమ్ శ్రీ టి. సాయి మనోహర్ అభినందించారు.

ప్రజలకు సూచనలు

సోషల్ మీడియా, వాట్సాప్ లేదా టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా వచ్చే పెట్టుబడి సూచనలను నమ్మరాదు.తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

SEBI అనుమతి పొందిన సంస్థల ద్వారా మాత్రమే పెట్టుబడులు పెట్టాలి.

డబ్బు ఉపసంహరణ కోసం అదనపు ట్యాక్సులు, ఛార్జీలు చెల్లించాలని కోరితే వెంటనే అనుమానించాలి.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలి.టి. సాయి మనోహర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సైబర్ క్రైమ్, సైబరాబాద్ కమిషనరేట్ .

మంత్రి సీతక్క నేడే నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటన

హైదరాబాద్, వెలుతురు జూన్ 21:

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటు మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను పరిశీలించనున్నారు.ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి బయలుదేరి కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో దుందుభి వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవల్ బ్రిడ్జి (HLB) పనులకు శంకుస్థాపన చేస్తారు.ఆ తర్వాత నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్‌ను పరిశీలించనున్నారు. అలాగే తెలంగాణ పోలీసు మహిళల భద్రత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న భరోసా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు.జిల్లాలో అభివృద్ధి, మహిళా సాధికారత, గ్రామీణ మౌలిక వసతుల బలోపేతానికి విచ్చేస్తున్న మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు, అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమాల అనంతరం మంత్రి సీతక్క హైదరాబాద్‌కు తిరిగి చేరుకోనున్నారు.

ఆవిసె గింజలు తింటే.. అద్భుతాలు

ప్రస్తుతం ఆరోగ్యంపై చాలా మందికి అవగాహన పెరుగుతోంది. దీంతో తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పడుతున్నారు. ఇందులో భాగంగానే రెగ్యులర్ ఫుడ్‌తో పాటు ఆరోగ్యానికి మేలు చేసే సీడ్స్‌ను తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి సీడ్స్‌లో ఆవిసె గింజలు ఒకటి. ఇందులోని ఎన్నో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతీ రోజూ ఒక స్పూన్ ఆవిసె గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో వచ్చే మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

అవిసె గింజల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్,, థయామిన్, కాపర్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా చేస్తాయి. అలాగే ఇందులోని బి కాంప్లెక్స్ విటమిన్లు, విటమిన్ ఇ, మెగ్నీషియం చర్మ సంరక్షణతో పాటు ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇందులో మెగ్నీసియం రక్తపోటును కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అంటున్నారు. శరీరంలో రక్త కణాల ఉత్పత్తిలో కూడా అవిసె గింజలు ఉపయోగపడతాయని నిపుణు అంటున్నారు.

ఇక జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కూడా ఇవి బాగా ఉపయోగపడతాయి. దీనికి కారణం ఇందులోని ఫైబర్ కంటెంట్. అవిసె గింజల్లో పుష్కలంగా ఉండే ఫైబర్ కంటెంట్ మెరుగైన జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో గుండె ఆరోగ్యానికి ఇది మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. గుండె పోటు వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. ఈ గింజల్లో ఉండే.. యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను అంతం చేస్తాయి. ఫలితంగా కేన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది. డయాబెటిస్ సమస్య బారిన పడకుండా ఉండాలంటే కచ్చితంగా ప్రతీరోజూ అవిసె గింజలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులోని ఫైబర్ కంటెంట్ రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అడ్డుకుంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్రమం తప్పకుండా వీటిని తీసుకుంటే రెగ్యులర్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

మసాలా టీ.. ఇంట్లోనే చేసుకోండి ఇలా..!

మసాలా టీ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి.. కానీ ఈ టీ తాగాలంటే ఏదైనా ఫేమస్ కేఫ్ కు వెళ్లాల్సిందే. అది కూడా జనం అరుపులు, కేకలు వింటూ తాగాలి. ఇంట్లోనూ మనం నిత్యం టీ చేసుకొని తాగుతాం.. కానీ మసాలా టీ(అల్లంటీ) లాంటి రుచి ఇంట్లో చేసుకుంటే రాదు. అయితే ఇంట్లోనే అల్లం టీ లేదా మసాలా టీ ఎలా చేసుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. మీరు గనక ఇక్కడ చెప్పినట్టు టీ కాచుకుంటే అచ్చం ఇరానీ టీ టేస్ట్ వచ్చి తీరుతుంది.

కావాల్సిన పదార్థాలు:

- పావు లీటర్ పాలు
- రెండు టేబుల్ స్పూన్ అల్లం తురుము
- మూడు టేబుల్ స్పూన్ల టీ పొడి
- నాలుగు లవంగాలు
- అయిదు యాలకులు
- రెండు టేబుల్ స్పూన్ల గులాబీ రెబ్బలు
- ఒక చిన్న ముక్క దాల్చినా చెక్క

ముందుగా పెనంపై టీ కాచే గిన్నెను పెట్టుకొని అందులో పాలు పోసి, పాలు ఒక పొంగు వచ్చే వరకు మరిగించుకోవాలి. అనంతరం ఆ పాల గిన్నెను పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక చిన్న పాత్ర తీసుకొని అందులో రెండు గ్లాసుల నీళ్లు పోసుకోవాలి. ఆ నీళ్లు కొంచెం మరిగాక.. అందులోనే కచ్చాపచ్చాగా దంచుకున్న యాలకులు, అల్లం తురుము, లవంగాలు, దాల్చిన చెక్కను వేసి కాసేపు మరిగించుకోవాలి. తరువాత బాగా మరిగిన ఆ డికాషన్ లో టీ పొడి, సరిపడా చెక్కర వేసుకొని.. రెండు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. డికాషన్ బాగా మరిగిన తరువాత.. ఇందులో మనం ముందుగానే వేడి చేసి పెట్టుకున్న పాలను పోసుకోవాలి. అలాగే రెండు టేబుల్ స్పూన్ల గులాబీ రెబ్బలను కూడా కలుపుకోవాలి. గులాబీ రెబ్బలను టీలో కలుపుకోవడం ద్వారా టీ మంచి రుచిగా ఉండడంతో పాటు చిక్కగా, సువాసన భరితంగా ఉంటుంది. తరువాత స్టవ్ ను మీడియం మంటలో ఉంచుకొని.. గరిటెతో టీని కలుపుతూ అయిదు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. అంతే పొగలు కక్కే అల్లం టీ సిద్ధమైపోతుంది.



బిర్యానీ తింటూ, కూల్ డ్రింక్ తాగుతున్నారా..?

వెడి వెడిగా చికెన్ బిర్యానీ తింటూ.. కూల్‌కూల్‌గా కూల్ డ్రింక్ తాగితే.. అబ్బా ఆ మజానే వేరు అని చాలా మంది భావిస్తుంటారు. బిర్యానీ లాగిస్తూ, కూల్ డ్రింక్ సిప్ చేస్తూ చిల్ అవుతుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. నిజానికి కూల్ డ్రింక్ తాగడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని తెలిసిందే. అందులోనూ బిర్యానీ తింటూ, కూల్ డ్రింక్ తాగడం మరింత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ కూల్‌డ్రింక్ తాగుతూ.. బిర్యానీ తినడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

* బిర్యానీ తింటూ కూల్ డ్రింక్ తాగితే కడుపులో ఆమ్లత్వం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా బిర్యానీ లాంటి మసాలాలు ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకుంటే కడుపులో గ్యాస్ట్రిక్ యాసిడ్ విడుదలవుతుంది. దానికి తోడు కూల్ డ్రింక్ తీసుకుంటే అందులోని యాసిడ్స్ జీర్ణ వ్యవస్థలో ఆమ్లాన్ని మరింత పెంచుతుంది. దీంతో ఇది గ్యాస్, గుండెలో మంట సమస్యకు దారి తీస్తుందని అంటున్నారు. మొదట్లో బాగానే అనిపించినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది.

* జీర్ణ సంబంధిత సమస్యలకు సైతం ఇది దారి తీస్తుందని నిపుణులు అంటున్నారు. కూల్ డ్రింక్‌లో ఉండే కార్బనేషన్ జీర్ణక్రియపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది అజీర్తి, పొట్టలో నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతుంది.

* మధుమేహంతో బాధపడేవారికి ఇది మరింత ప్రమాదానికి కారణమవుతుంది. బిర్యానీలో ఉండే కార్బోహైడ్రేట్స్, కొవ్వులు.. కూల్ డ్రింక్స్‌లో ఉండే అధిక చక్కెర స్థాయిలు రక్తంలో షుగర్ లెవల్స్ పెరగడానికి కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

* కూల్ డ్రింక్స్‌లో అధిక చక్కెరలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి లివర్‌తో పాటు కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బిర్యానీలో ఉన్న ప్రోటీన్లు, కొవ్వులు శరీరానికి అధిక శక్తిని ఇస్తాయి. కూల్ డ్రింకులతో పాటు తీసుకోవడం వలన శరీరంలో టాక్సిన్ లు ఎక్కువ అవుతాయి, ఇది కాలేయంతో పాటు కిడ్నీ పనితీరును ప్రభావితం చేస్తుంది.

* కూల్ డ్రింక్స్‌లో అధికంగా ఉండే చక్కెరలు, కేలరీలు శరీరంలో కొవ్వు పెరగడానికి కారణమవుతాయి. అలాగే బిర్యానీలోని కొవ్వు ఒబేసిటీ, అధిక రక్తపోటుకు దారి తీస్తాయి. దీర్ఘకాలంలో ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగటానికి దారితీస్తుంది. దీంతో గుండె సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి.

బీజేపీ కుట్రతోనే నామినేషన్ తిరస్కరణ

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆడిన పెద్ద రాజకీయ డ్రామా మరియు కుట్ర దాగి ఉందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం నాడిక్కడ నాంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం 'గాంధీ భవన్' లో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజ్యసభ స్థానం కోసం తన కోసం తెలంగాణలో ఎవరూ ఎలాంటి రాజీనామాలు చేయాల్సిన అవసరం లేదని ఆమె ఈ సందర్భంగా తెగేసి చెప్పారు. తాను మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహిళనని, ఒకవేళ తెలంగాణ నుండి బలవంతంగా ఎవరితోనైనా రాజీనామా చేయించినా తాను ఆ రాజ్యసభ పదవిని అస్సలు తీసుకోనని అత్యంత స్పష్టంగా ప్రకటించారు.రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం గాంధీ భవన్‌లో మాట్లాడిన మీనాక్షి నటరాజన్.. పార్టీలోని అంతర్గత పరిణామాలపై క్లారిటీ ఇచ్చారు. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, సీనియర్ న్యాయవాది మరియు ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ లాంటి మహామహులైన జాతీయ నాయకుల కోసం వేరే రాష్ట్రాల నేతలు తమ సీట్లను త్యాగం చేయడంలో అర్థం ఉందన్నారు. కానీ, తనలాంటి సాధారణ కార్యకర్త కోసం తెలంగాణకు చెందిన రాజ్యసభ స్థానాన్ని వదులుకుంటే దానికి తన మనస్సాక్షి ఒప్పుకోదని, ఆ స్థానాన్ని తాను ఆశించడం లేదని స్పష్టం చేశారు.తనపై ఉన్న పాత కేసుల వివరాలను కాంగ్రెస్ పార్టీకి చెందిన సొంత నేతలే ఎన్నికల సంఘానికి లీక్ చేశారంటూ వస్తున్న వార్తలను మీనాక్షి తీవ్రంగా ఖండించారు. అదంతా పచ్చి అబద్ధమని, కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం సృష్టించడానికి బీజేపీ నేతలే కావాలని ఇటువంటి తప్పుడు ప్రచారాలను పుట్టించారని మండిపడ్డారు. తాను ఎల్లప్పుడూ బాధితుల పక్షానే నిలబడతానని చెప్పారు. పార్టీ నేత శ్రీలతకు టికెట్ ఇవ్వకపోవడానికి అనేక రాజకీయ సమీకరణాలు, బలమైన కారణాలు ఉన్నాయన్నారు. ఆమెపై కొన్ని ఆరోపణలు ఉన్నప్పటికీ, ఒక మహిళగా ఆమె బాధను విన్నామని.. అందుకే సదరు జిల్లా కాంగ్రెస్ (డీసీసీ) అధ్యక్షుడిని పదవి నుంచి తొలగించామని వివరించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అధికార బలంతో ఎన్నికల సంఘాన్ని (ఈసీ) పూర్తిగా లొంగదీసుకుని, రెండు వ్యవస్థలూ కుమ్మక్కై తన నామినేషన్‌ను అక్రమంగా తిరస్కరించాయని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. ఇది కేవలం ఒకే ఒక్క రాజ్యసభ సీటుకు సంబంధించిన చిన్న విషయం కాదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని గాలికొదిలేసి 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' (వన్ నేషన్ వన్ ఎలక్షన్) విధానాన్ని బలవంతంగా రుద్దేందుకు కమలం పార్టీ చూస్తోందని విమర్శించారు. గతంలో వినాయకుడి విగ్రహాలు పాలు తాగుతున్నాయంటూ అబద్ధాలు ప్రచారం చేసినట్లే, ఇప్పుడు తన నామినేషన్ విషయంలోనూ బీజేపీ బురదజల్లుతోందని.. అయితే ఇది సోషల్ మీడియా యుగమని, త్వరలోనే నిజాలన్నీ ప్రజల ముందుకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీని మానసికంగా ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ రకరకాల అబద్ధాలను అస్త్రాలుగా వాడుకుంటోందని మీనాక్షి ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైనందుకు తనకు ఎలాంటి వ్యక్తిగత బాధ లేదని, కాకపోతే ఈ ఘటనతో బీజేపీ నైజం దేశవ్యాప్తంగా బట్టబయలైందని అన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ సంస్థలన్నీ కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ పత్రాల పరిశీలన జరుగుతున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నేతలను లోపలికి (స్క్రూటినీ రూమ్) ఎలా అనుమతించారని ఆమె ప్రశ్నించారు. అయినప్పటికీ దేశ అత్యున్నత న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు.ఈ రాజ్యసభ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూసిన బీజేపీకి.. సంఖ్యాబలం పరంగా తమ వైపు క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం అస్సలు లేదనే సత్యం ముందే అర్థమైపోయిందని మీనాక్షి నటరాజన్ విశ్లేషించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ అమ్ముడుపోరని తేలడంతో, ఎన్నికల అధికారులపై ఒత్తిడి తెచ్చి వారితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పారిశ్రామికవేత్త పరిమళ్ నత్వానీకి గతంలో ఇచ్చిన అవకాశాన్ని తనకు ఎందుకు నిరాకరించారని నిలదీశారు. నత్వానీ నామినేషన్ దాఖలు చేసినప్పుడు తప్పులను సరిదిద్దుకోవడానికి (నామినేషన్ కరెక్షన్) 2023 రూల్ బుక్ ప్రకారం 24 గంటల సమయం ఇచ్చారని.. కానీ తన విషయానికి వచ్చేసరికి 2026 రూల్ బుక్ అడ్డం పెట్టుకుని కనీసం ఒక్క నిమిషం కూడా సమయం ఇవ్వకుండా నామినేషన్ తిరస్కరించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు.తనకు ఏమాత్రం సంబంధం లేని ఒక పాత వివాదంలో, ఎవరో ఒక ప్రైవేట్ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనకు కేవలం లీగల్ నోటీసు మాత్రమే వచ్చిందని మీనాక్షి స్పష్టం చేశారు. ఒక సాధారణ సివిల్ లీగల్ నోటీసును క్రిమినల్ కేసుగా ఎలా చిత్రీకరిస్తారని ఆమె నిలదీశారు. పైగా ఎన్నికల సంఘం ఇచ్చే నామినేషన్ ఫారమ్‌లో ఎక్కడా కూడా 'లీగల్ నోటీసుల' వివరాలను నమోదు చేయాలనే కాలమ్ ప్రత్యేకంగా లేదని గుర్తుచేశారు. కేవలం నామినేషన్‌ను తిరస్కరించాలనే ముందస్తు ప్లాన్‌తోనే ఈ చిన్న విషయాన్ని పెద్దది చేశారని ఆరోపించారు.మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం తమకు స్పష్టమైన మెజారిటీ ఉందని మీనాక్షి నటరాజన్ అంకెల్లతో సహా వివరించారు. తమకు 62 మంది ఎమ్మెల్యేల బలం ఉందని, రాజ్యసభ అభ్యర్థిగా విజయం సాధించడానికి కేవలం 58 మంది సభ్యుల మద్దతు ఉంటే సరిపోతుందని చెప్పారు. సాంకేతికంగా ఇది వంద శాతం కాంగ్రెస్ గెలిచే సీటు అని స్పష్టం చేశారు. అసలు గెలవడానికి అవసరమైన కనీస సంఖ్యాబలం లేకపోయినప్పటికీ, బీజేపీ అక్కడ మూడో అభ్యర్థితో నామినేషన్ వేయించిందంటేనే వారి వెనుక ఉన్న రాజకీయ కుట్ర మరియు అప్రజాస్వామిక ఆలోచనలు స్పష్టమవుతున్నాయని మండిపడ్డారు.ఎన్నికల ప్రక్రియలో ఎన్ని ఆటంకాలు సృష్టించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, ఎమ్మెల్యేలు అందరూ ఏకతాటిపై నిలిచి తనకు పూర్తి మద్దతు ప్రకటించారని మీనాక్షి నటరాజన్ సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ హైకమాండ్ సైతం తనకు అండగా నిలిచిందని చెప్పారు. బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పోరాడుతాయని, చట్టపరంగా ఈ అన్యాయంపై పైకోర్టుల్లో పోరాటం కొనసాగిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్ అపాయింట్‌మెంట్ ఇప్పించండి

- సీఎం రేవంత్‌కు తెలంగాణ బీజేపీ చీఫ్ లేఖ
- ఆరు గ్యారంటీలపై రాహుల్‌ను ప్రశ్నిస్తామని వెల్లడి
- మహిళల రూ.2500 సాయం, ఇందిరమ్మ ఇళ్లు ఏమైందని ప్రశ్నలు
- రైతు భరోసా, వ్యవసాయ కూలీల నిధులపై నిలదీత
- ఆసరా పింఛన్ల పెంపు కోసం వృద్ధులు, దివ్యాంగుల నిరీక్షణ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థుల ఇబ్బందులు
- జాబ్ క్యాలెండర్ అమలు లేదు.. కాలేజీ అమ్మాయిలకు స్కూటర్లు లేవు
- సిఎం చొరవ తీసుకుని అపాయింట్‌మెంట్ ఇప్పించాలన్న రామచందర్ రావు

హైదరాబాద్ వెలుతురు జూన్ 21:

మెట్రో రైల్ ప్రాజెక్టు నిధుల కోసం ఢిల్లీ వెళ్తూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకారం కోరిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీసేందుకు తాము సిద్ధమయ్యామని ప్రకటించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి రామచందర్ రావు ఒక ఘాటైన లేఖ రాశారు. రాహుల్ గాంధీకి వినతిపత్రం సమర్పించి, రాష్ట్రంలో అమలుకాని ఆరు గ్యారంటీలపై ప్రశ్నించేందుకు తనకు ఆయన అపాయింట్‌మెంట్ ఇప్పించాలని లేఖలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి లేఖకు ప్రతిగా బీజేపీ చీఫ్ రాసిన ఈ లేఖ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ స్వయంగా తుక్కుగూడ బహిరంగ సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను నమ్మి తెలంగాణ ప్రజలు ఆ పార్టీకి ఓట్లేసి అధికారాన్ని కట్టబెట్టారని రామచందర్ రావు గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఆ ప్రధాన వాగ్దానాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో ప్రజల్లో తీవ్ర నిరాశ, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ ప్రజా వ్యతిరేకతను, వైఫల్యాలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకే తాము ఈ భేటీని కోరుతున్నట్లు స్పష్టం చేశారు.రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళలు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందా అని నెలలుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని రామచందర్ రావు లేఖలో పేర్కొన్నారు. అలాగే, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రకటిస్తూ ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఇస్తామన్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కేవలం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. అన్నదాతలను తీవ్రంగా వంచించిందని బీజేపీ చీఫ్ ఆరోపించారు. రైతు భరోసా కింద ఏడాదికి ఎకరాకు రూ.15,000 ఇస్తామన్న సాయం ఇంకా అందడం లేదని, కౌలు రైతులకు ఇస్తామన్న మద్దతు ఊసే లేదని మండిపడ్డారు. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 చొప్పున ఇస్తామన్న ఆర్థిక సాయంపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలన్నారు.రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు మరియు దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ పెద్ద మోసం చేసిందని రామచందర్ రావు ఆవేదన వ్యక్తంచేశారు. నెలకు రూ.4,000 చొప్పున ఆసరా పింఛన్లు పెంచి ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పింఛన్ల పెంపు కోసం ఊళ్లల్లో అవ్వాతాతలు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారని లేఖలో దుయ్యబట్టారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని రామచందర్ రావు విమర్శించారు. విద్యా భరోసా కింద విద్యార్థులకు ఇస్తామన్న రూ.5 లక్షల అంతర్జాతీయ విద్యా సాయం ఊసే లేదన్నారు. కనీసం గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కూడా ఈ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయడం లేదని, దీనివల్ల వేలాది మంది పేద విద్యార్థులు సర్టిఫికెట్లు అందక, ఉన్నత చదువులకు వెళ్లలేక కాలేజీల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని రామచందర్ రావు ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పదే పదే హామీ ఇచ్చినట్లుగా.. అర్హులైన నిరుద్యోగులందరికీ నెలకు రూ.4,000 చొప్పున నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు రాక, నిరుద్యోగ భృతి అందక యువత తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని లేఖలో పేర్కొన్నారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పక్కాగా ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగులకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని బీజేపీ చీఫ్ ఎద్దేవా చేశారు. కాలేజీలకు వెళ్లే పేద అమ్మాయిలకు ఉచితంగా స్కూటర్లు పంపిణీ చేస్తామన్న ఆకర్షణీయమైన హామీ కూడా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందన్నారు. యువతను ఓటు బ్యాంకుగా వాడుకుని కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు.కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్లు కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి లేఖలు రాయడాన్ని తాము తప్పుబట్టడం లేదని, అయితే అదే సమయంలో తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్‌ను కూడా ఇప్పించే బాధ్యతను సీఎం తీసుకోవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల తరపున ఈ ప్రజా సమస్యలన్నింటినీ రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి నిలదీసేందుకు వీలుగా రేవంత్ రెడ్డి చొరవ చూపి, ఢిల్లీలో రాహుల్ గాంధీతో తమకు అపాయింట్‌మెంట్ ఖరారు చేయించాలని లేఖ ద్వారా కోరారు.

ఏపీలో 'ఇంటింటికీ యోగా'

- ఆగస్టు 15 నుంచి 'సంజీవని' పథకం అమలు..
- ఐజీఎం స్టేడియంలో సీఎం చంద్రబాబు యోగా
- రాష్ట్రాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- జంక్ ఫుడ్‌కు దూరం.. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం
- గ్రామ గ్రామాన యోగా మందిరాలు నిర్మాణం
- ప్రతి ఇంటికీ యోగాను తీసుకెళ్తామని వెల్లడి
- ప్రపంచానికి భారత శక్తిని చాటిన ప్రధాని మోదీ
- వచ్చే ఏడాది తిరుపతిలో 'యోగాంధ్ర' నిర్వహణ

విజయవాడ వెలుతురు జూన్ 21:

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన భారీ వేడుకల్లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'యోగాంధ్ర' లోగో ఉన్న ప్రత్యేక చొక్కా ధరించిన చంద్రబాబు.. ప్రముఖ యోగా గురువు స్వామి రామ్‌దేవ్ బాబా పర్యవేక్షణలో వివిధ రకాల ఆసనాలు వేశారు. సాంకేతిక పరిజ్ఞానానికి ఆధ్యాత్మికతను, యోగాను అనుసంధానిస్తే మన ప్రగతిని ఎవరూ ఆపలేరని సీఎం వ్యాఖ్యానించారు.విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జనసంద్రంగా మారాయి. ఉదయం 5 గంటల నుంచే యోగా గురు రామ్‌దేవ్ బాబా వేలాది మంది విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులతో యోగ సాధన చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లతో కలిసి రామ్‌దేవ్ బాబా స్వయంగా ఆసనాలు వేయించారు. సీఎం చంద్రబాబు ఎంతో సునాయాసంగా ప్రాణాయామం, అనులోమ–విలోమ వంటి క్లిష్టమైన పద్ధతులను ప్రదర్శించి అందరినీ అబ్బురపరిచారు. ఈ సందర్భంగా సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తామని సీఎం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.ప్రశాంతమైన వాతావరణంలో యోగా గురువు రామ్‌దేవ్ బాబాతో కలిసి యోగాభ్యాసం చేయడం అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ చొరవ వల్లనే ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా సుమారు 190 దేశాల్లో యోగా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. భారతదేశం ప్రపంచానికి 'విశ్వగురు' అని, ప్రపంచ దేశాలన్నింటికీ సరైన మార్గనిర్దేశం చేయగలిగే శక్తి ఒక్క మన దేశానికే ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.మనిషిలో శారీరక దృఢత్వాన్ని (ఫిజికల్ ఫిట్‌నెస్), మానసిక ప్రశాంతతను (మెంటల్ ఫిట్‌నెస్) పెంపొందించే అద్భుతమైన శక్తి కేవలం యోగాకు మాత్రమే ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. యోగాను సామాన్య ప్రజలకు సైతం చేరవేసేందుకు రామ్‌దేవ్ బాబా చేస్తున్న కృషి అమోఘమన్నారు. రాబోయే రోజుల్లో సాంకేతికత (టెక్నాలజీ), ఆధ్యాత్మికత కలయికతోనే సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. నిత్యం ఆధ్యాత్మికతను, యోగా సాధనను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, సంపన్నమైన 'హ్యాపీ ఆంధ్రప్రదేశ్' సాధన సాధ్యమవుతుందని, ఇందుకోసం ప్రతి పౌరుడు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.గతంలో విశాఖపట్నంలో నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా ఏపీ సరికొత్త రికార్డులను సృష్టించిందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ రికార్డులతో పాటు ఎన్నో ప్రపంచ రికార్డులను సాధించామన్నారు. అదే స్ఫూర్తితో వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా ప్రజలు ఏకకాలంలో యోగా సాధన చేస్తుండటం శుభపరిణామమని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఇంటింటికీ యోగాను చేరవేసి ప్రజారోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకోసం రాష్ట్రంలోని ప్రతి స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాల కార్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన 'యోగా మందిరాల'ను నిర్మిస్తామని వెల్లడించారు. ఈ యోగా కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించడానికి జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. నిపుణులైన యోగా శిక్షకుల బృందంతో 'స్టాండర్డ్ యోగా ప్రోటోకాల్స్' రూపొందించి, యోగాంధ్ర విశేషాల కోసం ఒక ప్రత్యేక వెబ్‌సైట్ (పోర్టల్) ను కూడా అందుబాటులోకి తెస్తామని వివరించారు.ఆధునిక జీవన శైలిలో భాగంగా ప్రజలను రోగాల బారిన పడేస్తున్న జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ సంస్కృతికి వీలైనంత దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను కోరారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని (ఆర్గానిక్ ఫార్మింగ్) పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని చెప్పారు. రసాయనాలు లేని పౌష్టిక ఆహారాన్ని అలవాటు చేసుకుని, నిత్యం యోగా చేస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని హితవు పలికారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్రంలో పచ్చదనాన్ని (గ్రీనరీ) 50 శాతానికి పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆగస్టు 15వ తేదీ (స్వాతంత్ర్య దినోత్సవం) నుంచి ఏపీవ్యాప్తంగా 'సంజీవని' అనే వినూత్న ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా అనుభవజ్ఞులైన వైద్య నిపుణులను నేరుగా ప్రజల వద్దకే తీసుకువెళ్తామని, ఇందులో యోగాను కూడా ఒక భాగం చేస్తామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం ఒక గంట సమయాన్ని యోగా, ధ్యానం (మెడిటేషన్), ప్రాణాయామం కోసం కేటాయిస్తే.. జీవితంలో అసలు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరమే రాదని సీఎం హితవు పలికారు.తాను గత 30 ఏళ్లుగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా అభ్యాసం చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. ముఖ్యమంత్రిగా నిరంతరం బిజీగా ఉంటూ, మానసిక ఒత్తిడిని కలిగించే ఎన్నో కఠినమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ.. నిత్యం యోగా చేయడం వల్లే వాటన్నింటినీ సునాయాసంగా అధిగమించగలుగుతున్నానని, పూర్తి ఉత్సాహంతో పని చేయగలుగుతున్నానని చెప్పారు. కాగా, ఈ వేడుకల్లో ఏపీలో ఏకకాలంలో 1.07 కోట్ల మంది పౌరులు, 2.5 లక్షల మంది శిక్షకులు యోగాలో పాల్గొన్నందుకు గాను 'రెండు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' లభించాయి. వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను అధికారులు వేదికపై సీఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాస వర్మ, మంతెన సత్యనారాయణరాజు, మంత్రులు సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ'లో సంక్షోభం.. మొత్తం కార్యవర్గం రాజీనామా

మలయాళ చిత్రసీమకు చెందిన నటీనటుల సంఘం 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్'లో సంచలనం చోటుచేసుకుంది. అంతర్గత విభేదాలు, ఆర్థిక లావాదేవీలు, స్పాన్సర్‌షిప్‌లకు సంబంధించిన వివాదాలు ముదరడంతో 'అమ్మ' అధ్యక్షురాలు, నటి శ్వేతా మేనన్ సహా కార్యవర్గ సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు శ్వేతా మేనన్ 'అమ్మ' సభ్యత్వానికి కూడా తాను రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

గతేడాది ఆగస్టులో జరిగిన ఎన్నికల తరువాత బాధ్యతలు స్వీకరించిన పరిపాలన కమిటీ ఏడాది కూడా పూర్తి కాకముందే వైదొలగడం గమనార్హం. ఆ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా శ్వేత, డబ్బింగ్ కళాకారిణి కుక్కు పరమేశ్వరన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తద్వారా 'అమ్మ' చరిత్రలోనే తొలిసారిగా రెండు అత్యున్నత పదవులు చేపట్టిన మహిళలుగా ప్రత్యేకత చాటారు. అయితే ఇటీవల మాజీ జాయింట్ సెక్రటరీ అన్సిబా హసన్ కమిటీకి రాజీనామా చేయడం, ఆ సమయంలో ఆమె కార్యవర్గంపై చేసిన తీవ్ర ఆరోపణలతో 'అమ్మ'లో సంక్షోభం ముదిరింది.

కార్యవర్గంలోని కొందరు సభ్యులు తనను వేధిస్తున్నారని, మతపరమైన కోణంలో తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్సిబా సంచలన ఆరోపణలు చేశారు. 'అమ్మ' కార్యక్రమాలకు మత సంస్థలను స్పాన్సర్లుగా తీసుకొచ్చారని, దాన్ని ప్రశ్నించినవారిని ఒంటరిని చేసి వేధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఉపాధ్యక్షురాలు లక్ష్మీప్రియ కూడా సంస్థ పనితీరులో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే కార్యవర్గం మొత్తం వైదొలగింది.

మమ్మల్ని తొలగించేందుకు కుట్రపన్నారు..

రాజీనామా అనంతరం శ్వేతా మేనన్ మాట్లాడుతూ.. తమ కమిటీని తొలగించే దురుద్దేశంతో కొందరు ఎజెండాను అమలు చేసినట్లు ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమందికి కమిటీ బాధ్యతలను అప్పగించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. తన పాలనలో సంస్థ ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగా ఉన్నాయన్నారు. గత కమిటీలో ఉన్న బాబూరాజ్ పాలనలోనే కొన్ని ఆర్థిక, పరిపాలన సంబంధిత అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

సోషల్ మీడియాకు బ్రేక్.. మనసుకు విశ్రాంతి కావాలి

'8టర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించారు నటి కయాదు లోహర్. ఇటీవల ఆమె సోషల్ మీడియాకు చిన్న విరామం ప్రకటించారు. శరీరానికి ఇచ్చినట్లే మనసుకూ విశ్రాంతి అవసరమని, అందుకే కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు. "సోషల్ మీడియా నుంచి చిన్న విరామం తీసుకుంటున్నా. ఒక్కోసారి మన శరీరానికి ఇచ్చినట్లే మనసుకూ విశ్రాంతి కావాలి. స్క్రీన్‌కు దూరంగా ఉండి, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని అనుకుంటున్నా. నాకు మద్దతుగా నిలిచి, ప్రోత్సహించి, ప్రేమ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ సందేశాలు, ప్రేమ నాకు ఎంతో విలువైనవి. కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటా, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్‌ను నా టీమ్ ఈ అకౌంట్ ద్వారా షేర్ చేస్తుంది. అందరికీ శాంతి,ఆనందం కలగాలని కోరుకుంటున్నా. త్వరలో కలుద్దాం" అని కాయదు రాసుకొచ్చారు. ప్రస్తుతం ఆమె జీవీ ప్రకాష్ హీరోగా మారియప్పన్ చిన్నా దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'లో నటిస్తున్నారు.

విజయ్ సేతుపతి కొత్త చిత్రం

కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు విలక్షణ నటుడు విజయ్ సేతుపతి. ఈ ఏడాది 'ట్రైన్', 'స్లమ్ డాగ్' లాంటి చిత్రాలతో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్న ఆయన.. ఇప్పుడు మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'కాదలిక్క నేరమిల్లై'తో గతేడాది మంచి విజయాన్ని అందుకున్నారు దర్శకురాలు కృతిక ఉదయనిధి. ఇప్పుడామె తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రాన్ని రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోందట. వచ్చే వారం చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని, త్వరలో మరిన్ని వివరాల్ని వెల్లడించే అవకాశాలు ఉన్నాయని విజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం..

శ్రీలంకపై ఘనవిజయంతో ట్రై-సిరీస్ కైవసం చేసుకున్న ఇండియా-ఎ

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రికార్డు విధ్వంసంతో చెలరేగడంతో త్రైపాక్షిక వన్డే సిరీస్ ఫైనల్ పోరులో శ్రీలంక-ఎ జట్టుపై భారత్-ఎ 66 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ చిరస్మరణీయ గెలుపుతో భారత యువ జట్టు ఛాంపియన్‌గా నిలిచి ట్రోఫీని ముద్దాడింది. మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్-ఎ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు సాధించింది.

భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లోనే 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 94 పరుగులు చేసి లంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, లిస్ట్-ఎ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతకం నమోదు చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. అతనితో పాటు కెప్టెన్ తిలక్ వర్మ 90 బంతుల్లో 67 పరుగులతో బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడగా, ప్రియాంశ్ ఆర్య (39), ఆఖర్లో అనుకుల్ రాయ్ (15 బంతుల్లో 39) వేగంగా పరుగులు జోడించి జట్టుకు భారీ స్కోరు అందించారు.

అనంతరం 378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక-ఎ జట్టును భారత బౌలర్లు సమర్థవంతంగా కట్టడి చేశారు. లంక బ్యాటర్లలో వానుజ సహన్ (62), సదీర సమరవిక్రమ (52) అర్ధసెంచరీలతో గట్టి పోరాటం చేసినప్పటికీ, నిర్ణీత విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో శ్రీలంక-ఎ జట్టు 47.1 ఓవర్లలో 311 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో పేసర్ యష్ ఠాకూర్, స్పిన్నర్ విప్రాజ్ నిగమ్ చెరో 3 వికెట్లతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

శ్రీ చరణి అద్భుత బౌలింగ్ వృథా

భారత్‌పై 6 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం!

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గ్రూప్-1 లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టుకు నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో దక్షిణాఫ్రికా మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్ షఫాలీ వర్మ 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్‌తో 31 పరుగులు చేయగా, స్మృతి మంధాన 17 పరుగులు (12 బంతులు, 3 ఫోర్లు) చేసి అవుట్ అయింది. ఆ తర్వాత వచ్చిన యాస్తికా భాటియా (15), జెమిమా రోడ్రిగ్స్ (12) తక్కువ పరుగులకే వెనుదిరిగారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 22 బంతుల్లో 2 ఫోర్లతో 24 పరుగులు చేయగా, ఆఖర్లో దీప్తి శర్మ (21 బంతుల్లో 29, 3 ఫోర్లు), రిచా ఘోష్ (15) పరుగులతో రాణించారు. అరుంధతి రెడ్డి 6 పరుగులు, ప్రేమ రావత్ 3 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మరిజానే కాప్, షబ్నిమ్ ఇస్మాయిల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు టాజ్మిన్ బ్రిట్స్ (40 పరుగులు, 36 బంతులు), లారా వోల్వార్డ్ (20 పరుగులు, 21 బంతులు) మంచి భాగస్వామ్యాన్ని అందించారు. వన్‌డౌన్ బ్యాటర్ అన్నెరీ డెర్క్సన్ (0) డకౌట్ కాగా, నాడిన్ డి క్లెర్క్ (5) నిరాశపరిచింది. అయితే, నాలుగో స్థానంలో వచ్చిన మరిజానే కాప్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి కేవలం 45 బంతుల్లోనే 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆఖర్లో క్లో ట్రయాన్ (10 నాటౌట్) అండగా నిలవడంతో సౌతాఫ్రికా మరో 5 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరింది. భారత బౌలర్లలో శ్రీ చరణి అద్భుతంగా రాణించి 3 వికెట్లు పడగొట్టగా, షఫాలీ వర్మకు ఒక వికెట్ దక్కింది.

ఇంగ్లాండ్ జట్టులోకి బెన్ స్టోక్స్ పునరాగమనం

మూడో టెస్టుకు సారథిగా బాధ్యతలు

న్యూజిలాండ్‌తో జరగబోయే మూడో టెస్టు మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ప్రకటించిన జట్టులోకి స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ తిరిగి వచ్చాడు. ఇటీవల లండన్‌లోని ఒక నైట్‌క్లబ్ వివాదంలో చిక్కుకున్న కారణంగా ఇతను రెండో టెస్టు మ్యాచ్ ఎంపికకు దూరమయ్యాడు. అయితే ఈ ఘటనపై బోర్డు జరిపిన క్రమశిక్షణా విచారణ ముగియడంతో స్టోక్స్‌ను తిరిగి జట్టులోకి తీసుకుంటూ ఈసీబీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. నాటింగ్‌హామ్‌లోని ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జూన్ 25 నుండి ప్రారంభం కానున్న చివరి టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టుకు ఇతనే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

జూన్ 8న జరిగిన ఆ నైట్‌క్లబ్ ఘటనపై విచారణ జరిపిన ఈసీబీ, అందులో ఆటగాళ్ల ప్రమేయంపై స్పష్టతనిచ్చింది. సారాసెన్స్ రగ్బీ ఆటగాడు టోటోవా అవ్వాతో జరిగిన ఘర్షణలో ఇంగ్లాండ్ ఆటగాడు గస్ అట్కిన్సన్‌పై రెండుసార్లు దాడి జరిగిందని, అయితే అతను తిరిగి ఎదురుదాడి చేయలేదని బోర్డు నిర్ధారించింది. అలాగే ఈ గొడవలో బెన్ స్టోక్స్ ప్రత్యక్షంగా పాల్గొనలేదని విచారణలో తేలింది. అయినప్పటికీ క్రీడాకారులకు ఉండాల్సిన ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గాను స్టోక్స్, అట్కిన్సన్ ఇద్దరికీ బోర్డు గట్టిగా లిఖితపూర్వక హెచ్చరిక లేఖలను జారీ చేసింది.

నైట్‌క్లబ్ హింసాత్మక ఘటనలో ఆటగాళ్లపై ఎలాంటి తప్పు లేదని తేల్చిన ఈసీబీ, మూడో టెస్టు ఆడే తుది జట్టు ఎంపికకు వీరిని అందుబాటులో ఉంచింది. దీంతో ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్ కూడా తిరిగి ఇంగ్లాండ్ జట్టులోకి చేరాడు. ఇటీవల జరిగిన ఓవల్ టెస్టు మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం పాలైన ఇంగ్లాండ్ జట్టు, ఇప్పుడు రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ పునరాగమనంతో మళ్లీ బలోపేతంగా కనిపిస్తోంది. జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఈ కీలక పోరులో గెలిచి సిరీస్‌ను ఘనంగా ముగించాలని ఇంగ్లాండ్ పట్టుదలగా ఉంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com